అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 21-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 320

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

యువతకు మాది భరోసా

- అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ విడుదల
- పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్తి స్థాయిలో ప్రక్షాళన : కేటీఆర్



నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువత భవిష్యత్‌కు తమ పార్టీదే పూర్తి బాధ్యత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అశోక్‌నగర్‌తో పాటు యూని వర్సిటీలలో ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న పలువురు విద్యార్థులు కేటీఆర్‌ను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో ఉద్యోగాల నియామకం, ఏర్పడ్డ అడ్డంకులను చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెప్పిన సలహాలు సూచనలను పూర్తి సానుకూల దక్పథంతో ముందుకు తీసుకెళ్తామని అన్నారు.. అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పనితీరు విషయంలో విద్యార్థుల ఆకాంక్షలకు అనుకూలంగా పూర్తిగా ప్రక్షాళన చేయనున్నట్టు తెలిపారు.

ప్రస్తుతం కొనసాగుతున్న సుమారు 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడంతో పాటు. వివిధ నోటిఫికేషన్ల భర్తీ ప్రక్రియ పై ఉన్న కోర్టు కేసుల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని వేగంగా ఖాళీలను భర్తీ చేస్తా మని చెప్పారు. ప్రభుత్వ ఉద్యో గాల కల్పనలో తమ నిబద్ధతను ఎవరు శంకిం చాల్సిన అవసరం లేదన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో 2 లక్షల 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 1,62,000 పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు.

దేశంలో తెలంగాణ కన్న ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలను గత పది సంవత్సరాల్లో భర్తీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఏది లేదన్నారు. తమపై కేవలం రాజకీయ దురు ద్దేశంతో విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర యువకులకు సమాధానం చెప్పా లని డిమాండ్ చేశారు. యువకులు, విద్యార్థులను కాంగ్రెస్ పార్టీ తన స్వార్థ రాజకీయాల కోసం రెచ్చగొడు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాల కల్పనలో కాంగ్రెస్ చేస్తున్న అసత్య పూరిత ప్రచారాలను తిప్పికొట్టి నిజాలు తెలుసుకోవాలని ఆయన వారికి విజ్ఞప్తి చేశారు. కాగా కేటీఆర్‌తో భేటీ తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో తమకున్న సందేహాలు నివృత్తి అయినట్టు పలువురు విద్యార్థులు తెలిపారు.



పీజీ కోర్సు తొలగించొద్దని విద్యార్థుల నిరసన

- ప్రధాన రోడ్డుపై ఆందోళన

నవతెలంగాణ- న్యాల్‌కల్

పీజీ కోర్సు తొలగించొద్దని విద్యార్థులు రోడ్డుపై బైటాయించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్(బి)లో సోమవారం జరిగింది. ప్రభుత్వం మిర్జాపూర్(బి) ఓయూ పీజీ కళాశాలను ఎత్తేయడానికి కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీజీ విద్యార్థులు ఎన్ కిరణ్, శివకుమార్, నరసింహులు, నిఖిల్ మాట్లాడుతూ.. పీజీ చదువుకోవాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోందన్నారు. ఈ కళాశాలలో అనలెటికల్ కెమిస్ట్రీ కోర్సును తొలగిస్తూ ఓయూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఐదుగురు విద్యార్థుల అడ్మిషన్లను తొలగించారని చెప్పారు. పీజీ కళాశాలను పూర్తిగా ఎత్తేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పీజీ కోర్సును కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న హద్నూర్ ఎస్ఐ రామానాయుడు అక్కడికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పి శాంతింపజేశారు. విద్యార్థుల సమస్యలను కాలేజీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

సీనియర్ పాత్రికేయుడు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ఎర్రం నర్సింగరావు మృతి

తలసాని, కోదండరాం, అంజన్‌కుమార్ యాదవ్, ఎస్.వీరయ్య, మందకృష్ణ సహా పలువురి సంతాపం

- టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే ఘన నివాళి
- అంత్యక్రియలు పూర్తి



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక సభ్యుడు, ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎర్రం నర్సింగరావు సోమవారం తెల్లవారుజామున మరణించారు. ఈనాడు దినపత్రికలో 30 ఏండ్లపాటు సుదీర్ఘంగా సేవలందించిన ఆయన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్, కవాడిగూడ విలేకరిగా వివిధ రాజకీయ పార్టీల నేతలకు, ప్రజా సంఘాల నాయకులకు, జర్నలిస్టులకు సుపరిచితుడు. గతంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) అధ్యక్ష, కార్యదర్శిగానూ ఆయన సేవలందించారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న నర్సింగరావు... తాను అనారోగ్యం నుంచి బయటపడటం లేదన్న బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నర్సింగరావు భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు భౌతికకాయాన్ని అప్పగించారు. సాయంత్రం బన్సీలాల్ పేట్‌లోని హిందూ స్మశాన వాటికలో నర్సింగరావు అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆయన కుమారుడు పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. నర్సింగరావు మరణ వార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజన్ కుమార్ యాదవ్, బిజెపి అభ్యర్థి పూసరాజు, రామకృష్ణ మఠం స్వామీజీ భూధమయానంద, శితికంటానందతోపాటు పలువురు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు, వివిధ పత్రికల జర్నలిస్టులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు.

తీరని లోటు : టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే, రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం

నర్సింగరావు మరణం పాత్రికేయ రంగానికి, పత్రికలకు, జర్నలిస్టులకు తీరని లోటని టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే పేర్కొన్నాయి. ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని, కుటుం సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపాయి. నర్సింగరావు మృతిపట్ల టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జీ ఆంజనేయులు, ఎన్ఏజే జాతీయ నాయకులు ఎన్.కొండయ్య, ఏ అమరయ్య సంతాపం తెలిపారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని అభిప్రాయపడ్డారు. ఫెడరేషన్‌కు నర్సింగరావు చేసిన సేవలు ఎనలేనివని గుర్తు చేశారు. ఆయన మృదుస్వభావి, స్నేహశీలి, అందరిని కలుపుకుపోయే మనస్తత్వం ఉన్న వ్యక్తి అని చెప్పారు. నర్సింగరావు మరణం ఫెడరేషన్‌కు తీరనిలోటని వ్యాఖ్యానించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ మేరకు సోమవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఫెడరేషన్ నాయకులు గుడిగ రఘు, హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, బి.జగదీశ్వర్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.చంద్రశేఖర్, బివిఎన్ పద్మరాజు, నాయకులు నాగవాణి, రాజశేఖర్, దామోదర్, నవీన్, యాదయ్య భీష్మాచారి, ప్రశాంత్, మధుకర్ తదితరులు నర్సింగరావు భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కేఎన్ హరి నర్సింగరావు మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రతి ఒక్కరితో స్నేహ సంబంధాలు నెరిపే నర్సింగరావు మరణం పత్రికారంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

నవతెలంగాణ ఎడిటర్, న్యూస్ ఎడిటర్ సంతాపం

నర్సింగరావు మృతి పట్ల నవతెలంగాణ సంపాదకులు ఆర్.సుధాభాస్కర్, న్యూస్ ఎడిటర్ ఆర్.రమేశ్ సంతాపం ప్రకటించారు. దీర్ఘకాలికంగా జర్నలిజంలో ఉంటూ పత్రికా రంగానికి ఆయన ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. నర్సింగరావు కుటుంబానికి వారు ప్రగాఢసానుభూతి తెలిపారు.

భద్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

- ద.మ.రైల్వే జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైళ్ల నిర్వహణలో షార్ట్‌కట్ పద్ధతులు వినియోగించవద్దని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో రైల్వే కార్యకలాపాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్‌లు (డిఆర్ఎమ్‌లు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా విధానాలను కచ్చితంగా పాటించాలనీ, లోకో పైలట్‌లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, రైలు కార్యకలాపాలు నిర్వహించే సిబ్బందికి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులనూ ఆయన సమీక్షించారు.

విరిగిన సాగర్ ఎడమకాల్వ ఎస్కేప్ షెట్టర్స్



వరద తాకిడికి నీట మునిగిన వరి పంట

- 200 ఎకరాల్లో నష్టం

నవతెలంగాణ-మునగాల

సూర్యాపేట జిల్లా మునగాల సమీపంలో నాగార్జున సాగర్ ఎడమకాల్వ ఎస్కేప్‌కు అమర్చిన షెట్టర్స్ ఆదివారం రాత్రి విరిగిపోయాయి. దాంతో తూము నుంచి ప్రవహించే వరద తాకిడికి కోతకొచ్చిన వరి పంటలు నీట మునిగాయి. చివరి దశలో ఉన్న బావులు, బోర్ల కింద సాగు చేసిన వరి పంటలను కాపాడేందుకు అధికారులు ఈ నెల 17న 6200 క్యూసెక్కుల నీటిని కాల్వకు విడుదల చేశారు. దశాబ్దాల కాలంగా ఈ షెట్టర్స్‌కు మరమ్మతులు లేని కారణం అవి తుప్పు పట్టి విరిగిపోయినట్టు సమాచారం. ఈ ఏడాది సాగర్ ఎడమకాల్వకు నీరు విడుదల లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు షెట్టర్స్ బేరింగులు అపహరించుకుపోయారు. దాంతోనే అవి విరిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటపొలాల మీదుగా వరదనీరు ప్రవహించడంతో పంటంతా నీట మునిగింది. మునగాల మండలంలోని మునగాలలో 30 ఎకరాలు, బరాఖత్ గూడెంలో50, ముకుందాపురంలో 50, చిలుకూరు మండలం పోలేనిగూడెంలో 50, బేతవోలులో 50ఎకరాల్లో పంట నీటమునిగింది. సమారు 200ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నెల 25వరకు కాల్వకు నీటిని విడుదల చేయాలని ఆదేశాలు వున్నప్పటికీ షెట్టర్స్ విరిగిన కారణంగా అధికారులు నీటిని నిలిపేశారు. కాల్వలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇసుక మూటలు వేసి తాత్కాలికంగా నీటిని ఆపేందుకు చర్యలు చేపట్టారు.

మైక్రోసాఫ్ట్ గూటికి శామ్ ఆల్ట్‌మన్

న్యూయార్క్ : ఓపెన్ఎఐ మాజీ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ దిగ్గజ టెక్ కంపెనీ మైక్రోసాఫ్ట్‌లో చేరనున్నారు. ఆల్ట్‌మన్ తమ కంపెనీ నూతన కృత్రిమ మేధ పరిశోధన బృందంలో చేరనున్నారని మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్యా నాదేళ్ల సోమవారం వెల్లడించారు.

ఆల్ట్‌మన్‌తో పాటు ఓపెన్ఎఐకి ప్రెసిడెంట్‌గా వ్యవహరించిన బయటకు వచ్చిన గ్రెగ్ బ్రాక్‌మన్ సైతం తమతో కలిసి పని చేయనున్నారని తెలిపారు. వీరు ఇరువురు తమ ఎఐ బృందానికి నేతృత్వం వహించనున్నారన్నారు. వారి విజయానికి కావాల్సిన వనరులు సమకూర్చనున్నామని తెలిపారు.

నిధుల సమీకరణలో అడ్విక్ కాపిటల్

హైదరాబాద్ : బ్యాంకింగేతర విత్త సంస్థ అడ్విక్ కాపిటల్ నిధుల సమీకరణకు ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం అల్టర్నేట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఎఐఎఫ్) అనుమతుల కోసం సెబీకి దరఖాస్తు చేసుకున్నట్లు ప్రకటించింది. ఆర్‌బిఐ గుర్తింపు పొందిన ఈ ఎన్‌బిఎఫ్‌సి ఎఐఎఫ్-2 కేటగిరి లైసెన్స్ అనుమతి కోరింది. ఎఐఎఫ్ ద్వారా రూ.250 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అడ్విక్ కేపిటల్ తెలిపింది.

ఈనోలో చప్పరించే బిల్లలు



న్యూఢిల్లీ : ఎసిడిటి నుంచి ఉపశమనం కల్పించడానికి ఉపయోగించే ఈనోలో కొత్తగా చప్పరించే బిల్లలు (ఈనో చూవి బైట్స్)ను విడుదల చేసినట్లు హేలియన్ సంస్థ వెల్లడించింది. ఇప్పుడు చప్పరించేందుకు అనువైన యాంటాసిడ్ ఈనో చూవబుల్ బైట్స్‌ను టాంగీ లెమన్, జెస్టీ ఆరెంజ్ రెండు రుచులలో ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఇవి ఎసిడిటీ నుంచి తక్షణం ఉపశమనం కల్పిస్తాయని పేర్కొంది.

ఫిజిక్స్‌వాలాలో 120మందికి ఉద్వాసన

న్యూఢిల్లీ : కరోనా కాలంలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వెలిసిన ఎడ్‌టెక్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. వ్యాపారం తగ్గి.. ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడంతో పొదుపు చర్యలకు దిగుతున్నాయి. ఇందులో భాగంగా ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. తాజాగా మరో ఎడ్‌టెక్ స్టార్టప్ ఫిజిక్స్‌వాలా 120 మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నట్లు సమాచారం. వ్యయాలను తగ్గించుకునేందుకే సిబ్బందిపై వేటు వేశామని ఫిజిక్స్‌వాలా హెచ్ఆర్ ప్రతినిధి సతీష్ ఖెంగ్రే తెలిపారు.

ఏసీబీకి చిక్కిన జనగామ మున్సిపల్ కమిషనర్

- మార్టిగేజ్ రిలీజ్ కోసం రూ.40,000 లంచం డిమాండ్

నవతెలంగాణ-జనగామ

లోన్ మంజూరు విషయం లో లంచం తీసుకుంటూ జనగామ మునిసిపల్ కమిష నర్ రజిత ఏసీబీకి చిక్కారు. మార్టిగేజ్ రిలీజ్ కోసమని రూ. 40000 లంచం తీసుకుండగా సోమవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య చెప్పిన వివరాల ప్రకారం.. లింగాల ఘన్పూర్ గ్రామానికి చెందిన శెట్టిపల్లి రాజు జనగామ పట్టణంలో జి-ప్లస్ టు ఇల్లు నిర్మిస్తున్నారు. అందుకు సంబంధించిన అనుమతులు పొందారు. నిబంధనల ప్రకారం మొత్తం ఏరియాలోని విలువకు 10 శాతం మార్టిగేజ్ చేశారు. ఇల్లు పూర్త యిన అనంతరం మార్టిగేజ్ నిధులు రిలీజ్ చేయాల్సి ఉంది. అందుకోసం మున్సిపల్ కమిషనర్‌ను ఆశ్రయించగా రూ. 60 వేలు లంచం డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని రూ.40 వేలకు రాజు ఒప్పుకున్నాడు. అనంతరం అతను ఏసీబీని ఆశ్రయించారు. డబ్బులు కమిషనర్ రజిత చెప్పినట్టు డ్రైవర్‌కు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కమిషనర్, డ్రైవర్‌ను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో మంగళవారం హాజరుపర్చనున్నారు.



కాంగ్రెస్‌పై ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్‌పార్టీపై బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధి సోమ భరత్ ఫిర్యాదు చేశారు. ఇప్పటికి నాలుగుసార్లు ఆ పార్టీపై ఫిర్యాదు చేశామనీ, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్నారని అన్నారు. ఇన్ని ఫిర్యాదులు చేసినా దురదృష్టవశాత్తు ఈసీ ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. సీఎం కేసీఆర్‌కు శిరచ్ఛేదం చేయాలని రేవంత్ అంటున్నారని తెలిపారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 21-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 320 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు | వెల : 6.50



ఆ పార్టీలన్నీ ఒక్క తాను ముక్కలే...

ఓటుతో ప్రజాస్వామ్యాన్ని గెలిపించండి

సీపీఐ(ఎం)అభ్యర్థులను ఆదరించండి

- భద్రాచలం వెంకటాపురం, మధిర బోనకల్ సభల్లో పొలిట్ బ్యూరో సభ్యులు విజయరాఘవన్

నవతెలంగాణ- వెంకటాపురం/ బోనకల్

బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ బూర్జువా పార్టీలన్నీ ఒక్క తాను ముక్కలే అని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు విజయరాఘవన్ అన్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో భద్రాచలం నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి కారం పుల్లయ్య గెలుపును ఆకాంక్షిస్తూ కుమ్మరి శ్రీను అధ్యక్షతన సోమవారం సభ జరిగింది. ఈ సందర్భంగా విజయరాఘవన్ మాట్లాడుతూ.. మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్న బీజేపీ, అవినీతిలో మునిగిపోయిన బీఆర్ఎస్, అసెంబ్లీ సీట్లను గుండుగుత్తగా అమ్ముకుంటున్న కాంగ్రెస్ పోటీలో ఉన్నాయన్నారు. ఆ నేతలంతా సంపాదించిన డబ్బుతో ఓట్లు కొని మరోమారు అధికారంలోకి రావాలని యత్నిస్తున్నారని విమర్శించారు. పేదల కోసం నిరంతరం శ్రమిస్తూ వారి పక్షాన నిలబడే సీపీఐ(ఎం) అభ్యర్థులు రాష్ట్రంలో 19 నియోజకవర్గాల్లో పోటీలో ఉన్నారని, వారందరినీ ప్రజలు ఆదరించి గెలిపించాలని అన్నారు. కేరళ విద్యా, వైద్య రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించి దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. అలాంటి రాజకీయ ప్రత్యామ్నాయం రావాలంటే ఎర్రజెండా నాయకత్వం వహిస్తున్న 19 మంది అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా శాసనసభకు పంపించాలని అన్నారు.

కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్ మాట్లాడుతూ.. ప్రజల పక్షాన భద్రాచలం నియోజకవర్గ సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థి కారం పుల్లయ్యను గెలిపించాలన్నారు. గత ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రజా పథకాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ తప్ప ప్రజాసమస్యలు పట్టించుకున్నారా అని ఆలోచించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు, సూడి కృష్ణారెడ్డి, గిరిజన సంఘ అధ్యక్షులు బీంరావు, సచిన్, ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధిర నుంచి పాలడుగు భాస్కర్ విజయం ఖాయం : విజయరాఘవన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, దేశానికి ప్రమాదకరంగా మారాయని, ఆ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలంటే శాసనసభ, పార్లమెంటుకు సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధులు ఎన్నిక కావాలని, ఆ విధంగా ప్రజలు తీర్పు ఇవ్వాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు, కేరళ ఎల్‌డిఎఫ్ చైర్మెన్ విజయ రాఘవన్ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం తూటికుంట్ల ...7లో

అసెంబ్లీలో మాట్లాడగలిగే ధైర్యం సీపీఐ(ఎం)కే ఉంది : వెంకట్

శాసనసభలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మాట్లాడగలిగే గుండె ధైర్యం, దమ్మూ సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలకు మాత్రమే ఉంటుందని, అటువంటి వారిని గెలిపించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. మధిర నియోజకవర్గం నుంచి పాలడుగు భాస్కర్ గెలుపుతోనే ప్రజా సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్రంలో ఈసారి సీపీఐ(ఎం)కి చెందిన ప్రజాప్రతినిధులు అడుగుపెట్టబో తున్నారన్నారు. సీపీఐ(ఎం) దమ్ము, ధైర్యం, బలమేమిటో మధిరలో చూపించబోతున్నామని అన్నారు. సీపీఐ(ఎం) కార్యకర్తలు, శ్రేణులు భాస్కర్ విజయం కోసం సైనికుల్లా ...7లో


ఎందుకు ఆపారు?



బిల్లుల నిలుపుదలకు కారణాలు చెప్పండి

తమిళనాడు, కేరళ గవర్నర్లకు సుప్రీంకోర్టు ఆదేశం

శాసనసభలో మీరూ భాగస్వాములేనని న్యాయస్థానం వ్యాఖ్య



రాష్ట్ర అసెంబ్లీ తీర్మానించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా మూడేండ్లుగా ఏం చేస్తున్నారని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాగే అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై జరుగుతున్న జాప్యానికి కారణాలు వివరించాలని కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌ను ఆదేశించింది. శాసనసభ ఆమోదం తెలిపిన బిల్లులను ఉద్దేశపూర్వకంగానే గవర్నర్లు ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారని తమిళనాడు, కేరళ, పంజాబ్ ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. వీటిలో తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది.

నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

తమిళనాడుకు సంబంధించి "మిస్టర్ అటార్నీ.. నవంబర్ 13న ఈ బిల్లులను గవర్నర్ డిస్పోజ్ చేశారు. నవంబర్ 10న ఇచ్చిన ఆర్డర్ వల్లే ఆమోదించారనే మా ఆందోళన. 2020 జనవరి నుంచి ఈ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడేండ్లుగా గవర్నర్ ఏం చేస్తున్నారు? ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించే వరకు గవర్నర్ ఎందుకు వేచి ఉండాలి?" అని అటార్నీ జనరల్ (ఏజీ) ఆర్. వెంకటరమణిని సీజేఐ డీవై చంద్రచూడ్ ప్రశ్నించారు.

రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్ల నియామకానికి సంబంధించి గవర్నర్ అధికారాలను ఉపసంహరించుకునే బిల్లులకు సంబంధించినవి మాత్రమే వివాదం అని, ఇది ఒక ముఖ్యమైన అంశం కాబట్టి, కొంత పునరాలోచన అవసరమని ఏజీ ఆర్. వెంకటరమణి తెలిపారు.

అయితే, పెండింగ్‌లో ఉన్న బిల్లులు మూడేండ్లు కిందటవని, జనవరి 2020లో గవర్నర్‌కు పంపించారని ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో, ధర్మాసనం పది బిల్లులను గవర్నర్ కార్యాలయానికి పంపిన తేదీలను రికార్డ్ చేసింది. అవి 2020 నుంచి 2023



వరకు ఉన్నాయనీ, ప్రస్తుత గవర్నర్ ఆర్ఎన్ రవి నవంబర్ 2021లో మాత్రమే పదవీ బాధ్యతలు స్వీకరించారని ఏజీ అన్నారు. ఇది ఏ గవర్నర్ ప్రవర్తనకు సంబంధించినది కాదని, సాధారణంగా గవర్నర్ కార్యాలయానికి సంబంధించినదని ధర్మాసనం పేర్కొంది.

'గవర్నర్ ఆలస్యం చేశారా లేదా అనేది సమస్య కాదు. సాధారణంగా రాజ్యాంగ విధులను అమలు చేయడంలో ఆలస్యం జరిగిందా? అనేది' అని ధర్మాసనం పేర్కొంది.

గవర్నర్ ఆమోదాన్ని నిలుపుదల చేస్తున్నట్టు చెప్పగలరా?

విచారణ సందర్భంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులకు సంబంధించి గవర్నర్‌కు ఉన్న అధికారాలను కూడా ధర్మాసనం పరిశీలించింది. 'ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు మూడే ఆప్షన్స్ ఉంటాయని, ఆయన వద్దకు పంపిన బిల్లులకు ఆమోదం తెలపడం, సమ్మతి తెలపకపోవడం, రాష్ట్రపతికి పంపడం అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నిబంధన ప్రకారం గవర్నర్ పున్ణపరిశీలన కోసం బిల్లుల్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపవచ్చు అని కోర్టు ...7లో

కేరళ గవర్నర్‌కు, కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై జరుగుతున్న జాప్యానికి కారణాలు వివరించాలని అత్యున్నత న్యాయస్థానం కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌ను ఆదేశించింది. గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే నిలుపుదల చేస్తున్నారనీ, త్వరితగతిన బిల్లులను ఆమోదించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, ఆయన కార్యాలయంతోపాటు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కేరళ ప్రభుత్వం తరపున మాజీ అటార్నీ జనరల్, సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 168 ప్రకారం గవర్నర్లు శాసనసభలో భాగమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, కానీ శాసనసభలో భాగమని గవర్నర్ అర్థం చేసుకోలేకపోతున్నారని అన్నారు. అందుకు సంబంధించిన వివరాలను సుప్రీం ...7లో



వెలుగులు నింపిందే ఇందిరమ్మ రాజ్యంలో..

అన్నారం బ్యారేజీ పగిలింది.. మేడిగడ్డ కుంగింది

- నమ్మక ద్రోహి సునితమ్మను అసెంబ్లీ గేట్ దాటనీయొద్దు

నర్సాపూర్ గిరిజనుల అభివృద్ధి కోసం రూ.100 కోట్ల ప్యాకేజీ

- రోడ్ షోల్లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ - మెదక్ ప్రాంతీయ ప్రతినిధి/పరకాల/ నడికూడ / ఖైరతాబాద్

'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి. బైబై కేసీఆర్ బైబై..' అనే నినాదాలతో రేవంత్‌రెడ్డి కార్యకర్తల్లో జోష్ పెంచి బహిరంగ సభను హోరెత్తించారు. సభకు హాజరైన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు రేవంత్‌రెడ్డితో గొంతు కలిపి నినాదాలు చేశారు. నర్సాపూర్ విజయభేరి సభకు జనం భారీగా తరలి రావడంతో రేవంత్‌రెడ్డి జోష్ పెంచారు. సంగారెడ్డి జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నిర్వహించిన విజయభేరి సభలో, పరకాల, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో రోడ్ షోల్లో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఇందిరమ్మ రాజ్యమంటే చీకటి రాజ్యమంటూ కేసీఆర్ చేసిన విమర్శలను తిప్పికొట్టారు. ఇందిరమ్మ రాజ్యమంటే దేశానికి వెలుగులు నింపిన రాజ్యమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఇందిరమ్మదేనన్నారు. సింగిల్‌విండో డైరెక్టర్‌గా, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా ...7లో

ఇందిరమ్మ రాజ్యమంటే పట్వారీల రాజ్యమా...?

అది భూమాత కాదు..భూమేత

- దొంగ మాటలు నమ్మితే గోస తప్పదు
- పదేండ్ల ప్రభుత్వంలో తెలంగాణ ప్రగతి బాట

ఆటో కార్మికులకు ఫిట్‌నెస్ చార్జీలు రద్దు చేస్తాం..

- పదేండ్ల తలరాతను మార్చేది ఓటే : ప్రజా ఆశీర్వాదసభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్



నవతెలంగాణ-కరీంనగర్,వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/ తిమ్మాపూర్/మిర్యాలగూడ/నకిరేకల్/స్టేషన్‌ఘనపూర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే తెస్తామంటున్నది భూమాత కాదు.. అది భూమేత అని కేసీఆర్ ఎద్దేవా చేశారు. ధరణికి బదులు భూమాత పోర్టల్ పెడతామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని, దానివల్ల దళారీల, పైరవికారుల రాజ్యం వస్తుందని చెప్పారు. ధరణి తీసేస్తే రైతుబంధు డబ్బులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. కేసీఆర్ కన్నా దొడ్డుగా ఎత్తుగా ఉన్న వాళ్ళు చాలామంది ముఖ్యమంత్రి అయ్యారు.. కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉన్న నల్లగొండ జిల్లాకు కనీసం మంచినీళ్లు ఇవ్వలేదని అన్నారు. నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ఇంకా తీరలేదని, నా దత్తత ఇంకా అయిపోలేదని, బీఆర్ఎస్‌ను గెలిపిస్తే అది కొనసాగుతుందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మానకొండూర్, స్టేషన్‌ఘనపూర్, జనగామ, నల్లగొండ, నకిరేకల్ నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడారు. కరీంనగర్‌తో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ ...7లో

ఆడిటోరియం స్లాబ్ కూలి ఇద్దరు కూలీలు మృతి

పది మందికి గాయాలు

- రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఘటన



నవతెలంగాణ-మొయినాబాద్

ఇండోర్ స్టేడియంలో నిర్మాణంలో ఉన్న ఆడిటోరియం కుప్పకూలి ఇద్దరు కూలీలు మృతిచెందాడు. మరో పది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో సోమవారం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

మొయినాబాద్ మండలం సురంగల్ రెవెన్యూ పరిధిలోని ఫైర్‌ఫాక్స్ టెన్నిస్ స్టేడియంలో ఆడిటోరియం నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణంలో బీహార్, కలకత్తాకు చెందిన 12 మంది కూలీలు పనిచేస్తున్నారు. పని చేసే క్రమంలో ప్రమాదవశాత్తు ఆడిటోరియం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో 12 మంది శిథిలాల కింద ఇరుక్కుపోయారు. ఇద్దరు కూలీలు బాబ్లూ(35), సునీల్(30) అక్కడికక్కడే ...7లో

స్కిల్ కేసులో చంద్రబాబుకు బెయిల్



అమరావతి : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఊరట లభించింది. స్కిల్ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆయనకు రెగ్యులర్ బెయిల్‌ను సోమవారం మంజూరు చేసింది. ఆగస్ట్ 9న స్కిల్ కేసులో చంద్రబాబు అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 31న ఆరోగ్య సమస్యలతో నాలుగు వారాలు మధ్యంతర బెయిల్ జారీ చేసింది. ఇప్పుడు రెగ్యులర్ బెయిల్ ఇచ్చిన నేపథ్యంలో, చంద్రబాబు ఈ నెల 28న రాజమండ్రి జైలుకు వెళ్లనక్కర్లేదని హైకోర్టు స్పష్టంచేసింది. మధ్యంతర బెయిల్ సమయంలో విధించిన షరతులు ఈ నెల 28 వరకే వర్తిస్తాయని వివరించింది. చంద్రబాబు నవంబరు ...7లో

ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం

విశాఖలో 36 బోట్లు పూర్తిగా, 9 పాక్షికంగా దగ్ధం



- సుమారు రూ.15.కోట్లు ఆస్తి నష్టం

విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 36 బోట్లు పూర్తిగా, 9 పాక్షికంగా దగ్ధమయ్యాయి. సముద్రంలో చేపల వేటకు వెళ్లి వచ్చిన ...7లో

ఉత్తర కాశీలో సహాయక చర్యలు ముమ్మరం చేయండి

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి



న్యూఢిల్లీ : ఉత్తరకాశీలో నిర్మాణంలో వున్న సొరంగం కుప్పకూలి చిక్కుకుపోయిన 41మంది కార్మికుల దుస్థితి పట్ల సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సంఘటన జరిగి వారం రోజులు గడిచిపోయిందని, ఇప్పటివరకు వారిని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం కాలేదని పేర్కొంది. కార్మికులను కాపాడేందుకు చేపట్టే సహాయక చర్యల కోసం అంతర్జాతీయ నిపుణులు, సంస్థల సాయం కేంద్ర ప్రభుత్వం ఎందుకు కోరడం లేదో అర్థం కావడం లేదని పొలిట్‌బ్యూరో పేర్కొంది. చిక్కుకుపోయిన కార్మికులను వెలికితీసేందుకు తాజా సాంకేతికతలను, నైపుణ్యాలను ఉపయోగించడానికి గల అన్ని ప్రయత్నాలు చేయాలని, వేటినీ మినహాయించరాదని పేర్కొంది.

59,779 బ్యాలెట్ యూనిట్లు

116 కౌంటింగ్ కేంద్రాలు ఎల్బీనగర్‌లో అత్యధికంగా 48 మంది పోటీ

- గజ్వేల్‌లో 44, కామారెడ్డిలో 39 మంది
- 51 శాతం పోల్‌స్లిప్‌ల పంపిణీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు గడువు సమీపిస్తుండటంతో ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 59,779 బ్యాలెట్ యూనిట్ల (బీయూ) ను (ఈవీఎమ్)ను వినియోగిస్తున్నది. వీటిలో అత్యధికంగా ఎల్బీనగర్ అసెంబ్లీ



నియోజకవర్గంలో 1,719 బీయూలను వినియోగిస్తున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ మూడు బీయూలు ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకంటే ఇక్కడి నుంచి అత్యధికంగా 48 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆ తర్వాతి రెండు, మూడు స్థానాలు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు పోటీచేస్తున్న గజ్వేల్, కామారెడ్డి ఉన్నాయి. గజ్వేల్‌లో 44 మంది పోటీలో ఉండగా 963 బీయూలను ఏర్పాటు చేస్తున్నారు. కామారెడ్డిలో 39 మంది పోటీచేస్తున్నారు. ఇక్కడ 798 బీయూలు వినియోగిస్తారు. అయితే ఓటర్లు అత్యధికంగా ఉన్న మల్కాజ్‌గిరిలో 33 మంది పోటీచేస్తున్నారు. ఇక్కడ 1,287 బీయూలు అవసరమని ఎన్నికల సంఘం ...7లో

రూ.1,760 కోట్ల విలువైన డ్రగ్స్, నగదు, మద్యం స్వాధీనం

- అత్యధికంగా తెలంగాణలోనే రూ.659.2 కోట్లు
- తరువాత రాజస్థాన్‌లో రూ.650.7 కోట్లు : 7లో..

కేంద్ర ఎన్నికల సంఘం

సంపాదకీయం

క్రీడా స్ఫూర్తి వెలగాలి

ఆటలో జట్టు గెలవాలని కోరుకోవడం ఎంత సహజమో, గెలుపోటములు కూడా అంతే సహజం. ఎందుకంటే రెండు జట్లు పోటీ పడితే ఏదో ఒక జట్టే గెలుస్తుంది. మన జట్టు ఓడిపోతే ఆ ఓటమిని స్వీకరించి గెలిచిన జట్టును అభినందించడమే నిజమైన క్రీడా స్ఫూర్తి. కాని ప్రపంచ కప్‌లో భారత జట్టు ఓటమి పట్ల క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడం చేతకాని కొన్ని మూకలు సోషల్ మీడియా వేదికగా నానా యాగీచేస్తున్నాయి. వీటిని తట్టుకోలేని అభిమానులు తీవ్ర ఆందోళనకు గురై చనిపోవడం అత్యంత విషాదం.

ఒక్క అడుగు.. ఇంకొక్క అడుగు అంటూ ఊరించిన విజయం ఈసారి కూడా అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. పుష్కరకాలం తర్వాత సొంత గడ్డపై వన్డే ప్రపంచకప్ ట్రోఫీని గెలవాలన్న టీమిండియా కల చెదిరిపోయింది. ఐసీసీ టోర్నీల్లో కంగారు జట్టు రికార్డుస్థాయిలో ఆరోసారి విజేతగా నిలవగా.. మూడోసారి కప్‌ను ముద్దాడాలని భావించిన భారత జట్టుకు నిరాశే ఎదురైంది. అత్యధిక పరుగుల వీరుడుగా విరాట్ కోహ్లి.. అత్యధిక వికెట్లు పడగొట్టిన ధీరుడిగా మహ్మద్ షమీ.. కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ రాణించిన రోహిత్ శర్మ.. మిడిలార్డర్‌లో స్థాయికి తగ్గట్లు ఆడిన శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్.. తమ పని తాము చేసుకుపోతూ విజ యాల్లో తమ వంతు పాత్ర పోషించిన బౌలింగ్ దళం... గొప్పగా ఆడింది భారత్ జట్టు. ఫైనల్ ఓటమి బాధ కలిగించేదే అయినా అదో విపరీతంగా మారకూడదు. విద్వేషాలకు దారితీయ కూడదు.

> ప్రభుత్వం తేనున్న ఆన్‌లైన్ గేమ్స్ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికీ, ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి, సమస్య-పరిష్కార, నిర్ణయం తీసుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేయటం కోసమని కేంద్రం చెప్తున్నది. జాతీయభావం, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను స్పృశిస్తాయని బీజేపీ సర్కార్ వింతవాదన చేస్తున్నది. కానీ, వారి అంతరార్థం వేరు. కేవలం ఈ గేమ్స్‌ను తయారుచేసే కార్పొరేట్ కంపెనీల ఆదాయాన్ని పెంచడం, ప్రజలను వాటికి బానిసలుగా మార్చడం కోసమే ఈ యాప్స్ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.



ఈ వరల్డ్‌కప్‌లో కేవలం టీమిండియా ఆటగాళ్లలోనే కాదు. ఈ టోర్నీ మొత్తంలో అత్యధిక వికెట్లు తీసిన ఆట గాడిగా చరిత్ర సృష్టించాడు మహ్మద్ షమీ. అలాంటి భారత టాప్ బౌలర్ జాతీయతను, దేశభక్తిని శంకించేలా వ్యాఖ్యలు చేయడం విద్వేష రాజకీయాలకు పరాకాష్ట. ఆటలకు మతం రంగు పులిమే ఇటువంటి క్షుద్ర రాజకీయాలు క్రికెట్‌కే కాదు, దేశ సమైక్యత, సమగ్రతలకే ప్రమాదకరం. మత విద్వేషాలను క్రీడలకు సైతం వ్యాపింపజేసే ఇటువంటి ధోరణులను ఆధునిక సమాజం ఎంత మాత్రం అనుమతించకూడదు. క్రీడలను క్రీడలుగానే చూడాలి.

నేడు క్రీడా సంస్కృతి మారిపోయింది. ప్రస్తుతం క్రీడలంటే డబ్బు, వ్యాపారం. బెట్టింగులు, మ్యాచ్‌ఫిక్సింగ్‌లు ఇప్పటికే క్రీడారంగాన్ని భ్రష్టుపట్టిస్తుండగా, ఇప్పుడు ఉద్వేగం, దేశభక్తి పేరుతో ఉన్మాదం తోడయ్యింది. పాలకులు కూడా క్రీడలను వ్యాపార దృష్టితో మాత్రమే చూస్తున్నారు. ఆటలతో విద్యార్థులు, యువకులు చైతన్యం అయితే తమకు ప్రమాదమని భావించే పాలకవర్గాలు నేడు వారిని క్రమంగా ఆటస్థలాలకు దూరం చేస్తున్నాయి. ప్రస్తుత బీజేపీ సర్కార్ మరో అడుగు ముందుకేసి మొబైల్‌కు ఎడిక్ట్ చేయాలని యోచిస్తోంది. అందుకు అవసరమైన కొత్త రకమైన మొబైల్, వెబ్ ఆధారిత గేమ్‌లను తీసుకురావటానికి యోచిస్తున్నది. ఆనందం కోసం మొదలైన ఆటకు బానిసలై సమస్తం కొల్పోతూ.. ప్రవర్తన మారడం కూడా ఒక మానసిక వ్యాధేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంటున్నది. స్వీయ నియంత్రణ కోల్పోయి, ఏడాది కంటే ఎక్కువకాలం వీటిని ఆడుతూ.. అదే పనిగా బతికేవారిని 'గేమింగ్ డిజార్డర్'తో బాధపడుతున్నట్టుగా పరిగణించాలని డబ్ల్యూహెచ్ఓ సూచిస్తున్నది. ఇప్పటికే పబ్జీ లాంటి గేమ్స్‌కు ఎడిక్ట్ అయి ఎంతో మంది హత్యలకు పాల్పడారు. ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రభుత్వాలు వ్యాపార ప్రయోజన క్రీడలకు పెద్దపీట వేస్తూ గ్రామీణ క్రీడలను నిర్వీర్యం చేయడం వల్లనే ఈ దుష్ఫలితాలు వస్తున్నాయి.

ప్రస్తుతం ప్రభుత్వం తేనున్న ఆన్‌లైన్ గేమ్స్ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికీ, ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి, సమస్య-పరిష్కార, నిర్ణయం తీసుకునే నైపు ణ్యాలను అభివృద్ధి చేయటం కోసమని కేంద్రం చెప్తున్నది. జాతీయభావం, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను స్పృశిస్తాయని బీజేపీ సర్కార్ వింతవాదన చేస్తున్నది. కానీ, వారి అంతరార్థం వేరు. కేవలం ఈ గేమ్స్‌ను తయారుచేసే కార్పొరేట్ కంపెనీల ఆదాయాన్ని పెంచడం, ప్రజలను వాటికి బానిసలుగా మార్చడం కోసమే ఈ యాప్స్ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. ఆటలు పిల్లలను అన్ని విధాలా తీర్చిదిద్ది, ఒత్తిడిని తగ్గించి గెలుపోటములు సహజమనే జీవిత సత్యాన్ని ప్రబోధిస్తాయి. కులమతాలకు, భాష, ప్రాంతం వంటి భావాలకు అతీతంగా సమైక్యత, సమభావం ఆటల ద్వారా అలవడతాయి. అలాంటి ఆటలకు ఈ ఆన్‌లైన్ గేమ్స్ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కావు, కాలేవు. అందుకే ఆటలు చదువులో ఒక భాగం కావాలి. అన్ని పాఠశాలల్లోనూ ఆటలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలి. వ్యాయామ ఉపాధ్యాయులను నియమించి, ఆటలను కరికులంలో కచ్చితంగా భాగస్వామ్యం చేయాలి. అప్పుడే అసలు సిసలు క్రీడాభివృద్ధి అవుతుంది. కానీ, ఇవన్ని చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసి యువతను యాప్‌లకు బానిసలు చేయడం సరికాదు. ప్రతికూల పరిస్థితుల్లో స్థైర్యం కోల్పోకుండా స్థిమితంగా కొనసాగడం విజేతల లక్షణం. అలా విలువైన ప్రదర్శనకు సిద్ధపడితే ముమ్ముందు భారత్ ప్రపంచకప్ కల సాకారం అవుతుందనడంలో సందేహం లేదు.

ఏడుపు - ఓదార్పు



'జంతువుల జనరల్ బాడి' పిల్లల హాస్య నాటికలో ఓ సన్నివేశం.

అడవిలో జంతువులన్నీ సమావేశమై తమను వివిధ సందర్భాల్లో మనుషులు ఎలా ఆడిపోసుకుంటున్నదీ మృగరాజు సింహంకు విన్నవించుకుంటాయి. ప్రధానమంత్రిగా ఉన్న నక్క వాటికి వివరణ ఇస్తూ ఉంటుంది.

పిల్లివచ్చి 'నన్ను గోడమీద పిల్లి అంటున్నారు మహాప్రభో' అని వాపోతే, స్వప్రయోజనాలకోసం పార్టీలు ఫిరాయించే వారిని గోడమీద పిల్లులు అని వ్యాఖ్యానిస్తారని నక్క వివరణ ఇస్తూ గోడలు అసెంబ్లీలోనూ, పార్లమెంటులోను ఉంటాయి గాని అడవిలో ఎందుకుంటాయి? ఎక్కడుంటాయి? అంటూ పిల్లిపై రెచ్చిపోతుంది. పిల్లి నోరు మూసుకుంటుంది. ఇంతలో మొసలి వచ్చి "అసెంబ్లీ అంటే గుర్తుకు వచ్చింది మహారాజా! 'ప్రజలపై పాలక పక్షానిది ఎప్పుడూ మొసలి కన్నీరే' అంటూ నన్ను అందరూ ఆడిపోసుకుంటారు. మాకు మాత్రం హృదయం ఉండదా? కన్నీరు రాదా? మేం ప్రాణులం కామా? అంటూ బావురుమంటుంది. దాంతో సింహం కూడా కరిగిపోయి మొసలిని అక్కున చేర్చుకుని ఊరడిల్లుము ఊరడిల్లుము. ప్రాణుల న్నాక సుఖదు:ఖాలు తప్పవు అని ఓదారుస్తుంది.

'ఆహా ఎంతటి అద్భుత దృశ్యము. మొసలికి సింహం ఓదార్పు. చూడటానికి రెండు కళ్ళూ చాలటం లేదు' అని నక్క వినయంతో చతురాడి ప్రేక్షకులకు నవ్వులు పువ్వులు పూయిస్తుంది.

***

ఇటీవల ఓ సభలో కన్నీరు మున్నీరుగా విలపించిన ఒక వ్యక్తిని ప్రధాని నరేంద్ర మోడీ అక్కున చేర్చుకుని ఓదార్చారు. 'మూడు దశా బ్దాల వర్గీకరణ పోరాటాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తించింది. వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం' అని మోడీ ప్రకటించగా ఆ వ్యక్తి ఉద్వే గానికి లోనైనట్టు పత్రికలు రాసాయి. 'పోరాటంలో ఈ చిన్నితమ్ముడితో భాగస్వామిని అవుతా! అని మోడీ అనగానే ఆ వ్యక్తికి దు:ఖం పొగిలి పొగిలి వచ్చినట్టు తెలిపాయి.

మాదిగ కులాల విశ్వరూప మహాసభలోనిది ఈ సన్నివేశం. ప్రధాని మోడీ గంభీరవదనం చెక్కు చెదరలేదని అవి వర్ణించాయి.

***

సోషల్ మీడియాలో ఆ ఫోటోతో పాటు ఓ పోస్టు చక్కర్లు కొట్టింది.

'నాటక మిత్రులకు శుభవార్త. నాటకం అంతరించిపోతుందని తెగ బాధపడిపోనవసరం లేదు. అవసరమైనప్పుడల్లా వ్యవస్థ తనకు కావాల్సిన సన్నివేశాలను, నటులను దానికదే సృష్టించుకుంటుంది. అనేది ఆ పోస్ట్ సారాంశం.

***

ఇందులో నటనెంత? నిజమెంత? అనేది శేషప్రశ్నగానే మిగిలిపోతుంది.

\- శైలి

బాధితుల ముసుగులో వలసవాదుల పెత్తనం



ప్రభాత్ పట్నాయక్

వలస విధానం 18, 19 శతాబ్దాల్లో రెండు వేర్వేరు పద్ధతుల్లో తలెత్తింది. వీటిలో మొదటిది స్థాపిత కేంద్రీకృత పాలనా వ్యవస్థల ద్వారా సంపదలో మిగులును పిండుకోవడం. వలస పాలకులు తాము బలప్రయోగాల ద్వారా ఆక్రమించుకున్న దేశాల్లో ...అక్కడ ఉన్న పాత పాలకుల స్థానంలో కొత్తగా తమ వలస పాలనను నెలకొల్పడం ఈ పద్ధతిలో కనిపిస్తుంది. ఈ పద్ధతికి భారతదేశం సరైన ఉదాహరణగా నిలుస్తుంది. స్థానికంగా ఉన్న చేతివృత్తులను దెబ్బ తీసి యూరోపియన్ ఉత్పత్తులకు మార్కెట్‌ను కల్పించడంతోబాటు తమ దేశాలకు కావలసిన సరుకులను ఇక్కడినుంచి కొల్లగొట్టి తరలించుకుపోవడం ఈ పద్ధతి సారాంశం. మన వంటి దేశాలలో అప్పటికే గణనీయంగా జనాభా నివసిస్తోంది గనుకను, ఇవి ఉష్ణ మండల ప్రాంతాలు అవడం చేతను శీతల ప్రదేశాల్లో జీవించే యూరోపియన్ ప్రజలు ఇక్కడికి చాలా తక్కువ సంఖ్యలోనే వలసలు వచ్చారు.

ఇక రెండో పద్ధతి-ఇతర భూభాగాలను ఆక్రమించుకుని, అక్కడి స్థానిక ప్రజానీకాన్ని వెళ్ళగొట్టి సంపన్న యూరోపియన్ దేశాల నుండి జనాలు వలసలు వచ్చి ఆక్రమించుకోవడం. ఈ పద్ధతికి సరిగ్గా అతికే ఉదాహరణ అమెరికా దేశం. సంపన్న దేశాల నుండి వలసలు వచ్చి స్థానికులను తరిమివేసి వారి సంపదను స్వాధీనం చేసుకోవడం ఈ పద్ధతిలోని ప్రధాన అంశం.

> గాజా వంటి ప్రాంతాలను బహిరంగ చెరసాలలుగా ఎంతోకాలం పాటు కొనసాగించడానికి ఇజ్రాయిల్ అంత సుముఖంగా ఉంటుందని భావించలేం. పాలస్తీనా ప్రజల ఉనికే తమ భద్రతకు ముప్పు అని ఇజ్రాయిల్ భావిస్తోంది. అందుచేత ఇజ్రాయిల్ దూకుడు ఇలానే కొనసాగితే అది పాలస్తీనా జాతి మొత్తాన్ని తుడిచిపెట్టేవరకూ ఆగదు. ఇజ్రాయిల్‌కు చెందిన నిర్మాణ సంస్థలు తమ వద్ద పని చేస్తున్న పాలస్తీనీయుల స్థానే భారతీయ కార్మికులను నియమించాలని కోరుతున్నాయి. అంటే మూడవ ప్రపంచదేశాల్లో భారీగా నిరుద్యోగులు ఉన్నంతకాలమూ పాలస్తీనా ప్రజలను గాని, మరేదైనా జాతి ప్రజలను గాని నిర్మూలించడం సామ్రాజ్యవాదులకు పెద్ద ఇబ్బంది కలిగించదు.

మొదటి పద్ధతిని "కొల్లగొట్టే సామ్రాజ్యవాదం" అని, రెండో పద్ధతిని "వలస వచ్చిన సామ్రాజ్యవాదం" అని నేనంటాను.

మొదటి పద్ధతిలో తాము స్వాధీనం చేసుకున్న భూభాగం నుండి సంపదను కొల్లగొడితే, రెండో పద్ధతిలో ఏకంగా ఆ భూమినే తమ స్వంతం చేసుకున్నారు. మొదటి పద్ధతిలో భూమి మీద శ్రమ చేయడానికి స్థానిక ప్రజానీకం అవసరమౌతారు. ఆ భూమి మీద వచ్చిన సంపదలో గరిష్ట భాగాన్ని గనుక సామ్రాజ్యవాదులు కొల్లగొడితే అప్పుడు స్థానిక ప్రజలు తిండి లేక మాడిపోతారు. బ్రిటిష్ పాలనలో భారతదేశంలో ఇదే జరిగింది. వరసగా కరువులతో ప్రజలు నానా అగచాట్లూ పడ్డారు. ఐతే, తాము కొల్లగొట్టడానికి కావలసిన సంపదను ఉత్పత్తి చేసేందుకు కొంత మందైనా స్థానిక ప్రజలు బతికివుండాలి గనుక బ్రిటిష్ ప్రభుత్వం ఆ కరువు సమయాల్లో కొన్నైనా సహాయ చర్యలు చేపట్టింది. అదే రెండో పద్ధతిలోనైతే ఆ విధంగా స్థానిక ప్రజలను బతికించి వుంచవలసిన అవసరం లేదు. వలసవచ్చిన వారి సంఖ్య తగినంతగా ఉంటే పని చేసేందుకు మనుషులకోసం వెతుక్కోనవసరమే లేదు. అందుచేత వలసవచ్చిన సామ్రాజ్యవాదులు స్థానిక జాతులను పూర్తిగా నిర్మూలించడానికే పూనుకున్నారు.

ఇలా వలసవచ్చి కొత్త ప్రాంతాల్లో స్థిరపడిన సామ్రాజ్యవాదులు తమ ఆధీనంలోకి అదనపు భూభాగాలను తెచ్చుకునేందుకు విస్తరణకు పూనుకున్నారు. ఇక ఆక్రమించుకోడానికి భూభాగం మిగలనప్పుడో లేదా పొరుగున మరొక బలమైన రాజ్యం ఉన్నప్పుడో మాత్రమే వాళ్ళ విస్తరణ ఆగింది.

ఇదంతా గతంలో ఎప్పుడో జరిగిపోయినది కదా అని ఎవరైనా మామూలుగా అనుకుంటారు. ఇంకా వలసపాలన అనేది ఎక్కడుంది అని కూడా అనుకోవచ్చు. కాని పెట్టుబడిదారీ దశలో సామ్రాజ్యవాదం వాస్తవంగా ఉనికిలో ఉంది. అందుచేత మనం ఆ విధమైన పొరపాటు అభిప్రాయానికి రాకూడదు. వర్తమాన కాలంలో వలస సామ్రాజ్యవాదానికి గట్టి ఉదాహరణ ఇజ్రాయిల్. శతాబ్దాలపాటు యూదులు మైనారిటీలుగా వేధింపులకు, హింసకు గురయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో వారిమీద సాగిన హింస పరాకాష్టకు చేరింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి కాందిశీకులుగా యూదులు పాలస్తీనాకు వలసవచ్చి ఇజ్రాయిల్ పేరుతో యూదు రాజ్యాన్ని 1948లో ఏర్పాటు చేసుకున్నారు. ఐతే అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రత్యేక శ్రద్ధతో అందించిన తోడ్పాటును ఉపయోగించుకుని ఇజ్రాయిల్‌లో అధికారం చెలాయించిన మితవాద ప్రభుత్వాలు వేధింపులకు గురైన కాందిశీకులకు ఆశ్రయంగా మొదలైన ఇజ్రాయిల్‌ను ఆధునిక వలస సామ్రాజ్యవాదానికి నమూనాగా మార్చివేశారు. వలసవచ్చిన సామ్రాజ్యవాదుల తరహాలోనే ఇజ్రాయిల్‌లో సాయుధులైన బృందాలు తమ ఆక్రమణలోకి అదనపు భూభాగాలను తెచ్చుకునేందుకు పూనుకున్నాయి. వెస్ట్ బ్యాంక్, గాజా వంటి కొత్త ప్రాంతాలను ఆక్రమించుకోడానికి పూనుకోడమే గాక అక్కడ ఉన్న జాతులను నిర్మూలించడానికి తయారౌతున్నాయి.

వలసవాదుల పాలన ప్రత్యేక లక్షణం జాతి వివక్షత. తమ ఆక్రమణలో ఉన్న ప్రతీ నగరంలోనూ రెండు భాగాలు ఉంటాయి. ఒక భాగంలో అధికారం చెలాయించేవారు, వారితోబాటు వలస వచ్చిన కొద్దిమంది ప్రజలు నివసిస్తారు. రెండో భాగంలో సామాన్య, స్థానిక ప్రజలు ఉంటారు. ఇప్పుడు ఇజ్రాయిల్ ఆక్రమణలో ఉన్న భూభాగాల్లోనూ అదే పరిస్థితి ఉంది. జాతి వివక్షత అక్కడ తాండవమాడుతోంది.

పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదం మద్దతు గనుక లేకపోతే ఇజ్రాయిల్‌లో వలస సామ్రాజ్యవాదం ఉండేదే కాదు. యూదులను శతాబ్దాలపాటు హింసకు, వేధింపులకు గురిచేసిన సామ్రాజ్యవాదులు తాము అంతకాలమూ కొనసాగించిన పాపాన్ని కడిగేసుకోడానికి ఇజ్రాయిల్‌కు మద్దతు కొనసాగిస్తున్నారు. ఆ క్రమంలో పాలస్తీనా ప్రజలను బలి చేస్తున్నారు. ఇజ్రాయిల్ లోని మితవాద శక్తులు చెలాయిస్తున్న వలసవాద సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సమర్ధించుకోడానికి గతంలో యూదుల మీద సాగిన హింస ఒక సాకుగా ఉపయోగపడుతోంది. ఆ ముసుగులో వాళ్ళు తమ విస్తరణను, వివక్ష పూరిత విధానాలను, జాతుల నిర్మూలనను కొనసాగిస్తున్నారు. పైగా ఇజ్రాయిల్ దుర్మార్గాలను ప్రశ్నించేవారిని "యూదు వ్యతిరేకులు"గా ముద్ర వేస్తున్నారు. ఆ నాటి నాజీలు ప్రదర్శించిన యూదు వ్యతిరేకతతో సరిపోల్చుతున్నారు.



> "వలసవాద సామ్రాజ్యవాదం" వర్తమాన సామ్రాజ్యవాద దశలో అత్యంత క్రూరమైన, దూకుడు కలిగిన భాగంగా ఉంది. పైగా తన దుర్మార్గాన్ని అది గత కాలంలో తమపై సాగిన హింస, వేధింపుల సాకుతో సమర్ధించుకుంటోంది. అందుచేత ఈ తరహా వలసవాద సామ్రాజ్యవాదాన్ని నిలవరించాలి. కేవలం పాలస్తీనా ప్రజల కోసమే గాక యావత్ ప్రపంచ ప్రయోజనాల రక్షణ రీత్యా ఇది అత్యవసరం. కేవలం ప్రపంచ ప్రజానీకపు ఒత్తిడితోనే ఇది సాధ్యపడుతుంది. కొలంబియా, బొలీవియా, దక్షిణాఫ్రికా తదితర దేశాలు ఇప్పటికే ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు తెంచుకున్నాయి. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా ప్రపంచమంతటా ప్రజాభిప్రాయం వ్యక్తమౌతోంది.

గతంలో యూదులపై సాగిన హింస, వేధింపులు సామ్రాజ్యవాదులకు, మితవాద శక్తులకు ఇప్పుడు ఒక సాకుగా ఉపయోగపడుతున్నాయి. గాజాలో సామాన్య ప్రజానీకం మీద ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దారుణాలు కళ్ళెదురుగా కనిపిస్తున్నాయి. వాటిని వ్యతిరేకిస్తూ పాలస్తీనా ప్రజానీకానికి సంఘీభావంగా వివిధ పెట్టుబడిదారీ దేశాల్లో తలపెట్టిన నిరసన కార్యక్రమాలను నిషేధించడానికి ఒక సాకుగా ఆ ప్రదర్శనలు "యూదు వ్యతిరేకత"తో కూడుకునివున్నాయని సామ్రాజ్యవాద ప్రభుత్వాలు ఆరోపిస్తున్నాయి. అటువంటి నిషేధాలతో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు ఆగిపోలేదు. లండన్ లో జరిగిన ఒక ప్రదర్శన విషయంలో పోలీసులు పాలస్తీనా పట్ల పక్షపాత వైఖరిని ప్రదర్శించారంటూ విమర్శించిన బ్రిటిష్ హోంశాఖ మంత్రి సుయెల్లా బ్రేవర్‌మాన్ తన పదవినే కోల్పోవలసివచ్చింది.

ఇజ్రాయిల్‌కు సామ్రాజ్యవాదులు మద్దతు కొనసాగించడానికి ఇంకో కారణం ఉంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలు వలసవాద సామ్రాజ్యవాదాన్ని అమలుచేయడం ద్వారానే ఉనికిలోకి వచ్చాయి. ఆ కాలంలో అవి అక్కడి స్థానిక జాతుల నిర్మూలనకు నిర్దాక్షిణ్యంగా పూనుకున్నాయి. అదే పనికి ఇప్పుడు తమకు అత్యంత అభిమాన పాత్రురాలైన ఇజ్రాయిల్ పూనుకుంటోంది. అటువంటప్పుడు దానికి తమ సమర్ధన తెలపకుండా ఎలా ఉండగలుగుతాయి?

అన్నింటికన్నా ముఖ్యమైనది ఇంకో కారణం ఉంది. పశ్చిమ ఆసియా ప్రాంతంలో తమకు నమ్మినబంటులాగా ఇజ్రాయిల్ ఇప్పుడు తయారైంది. ఒకప్పుడు అరబ్ ప్రాంతంలో కమ్యూనిజం బలమైన శక్తిగా ఉండేది. దానిని దెబ్బతీసి తన ఆధిపత్యాన్ని నిలుపుకోడానికి సామ్రాజ్యవాదం ఇస్లామిక్ మతోన్మాద శక్తులను బలపరచింది (వాటిలో ఒకప్పుడు హమాస్ కూడా ఉండేది). ఇజ్రాయిల్‌కు సాయుధ తోడ్పాటును అందించడం కూడా ఆ వ్యూహంలో భాగమే. ఒకపక్క ఇజ్రాయిల్ గాజా ప్రాంతంలో నరమేధాన్ని కొనసాగిస్తున్నా, ఐరాస భద్రతామండలి సమావేశాల్లో ఇజ్రాయిల్ తక్షణమే కాల్పుల విరమణ పాటించాలన్న తీర్మానానికి అమెరికా వ్యతిరేకంగా వోటు చేయడంలో ఆశ్చర్యమేమీ లేదు. "మానవతా దృక్పథంతో వ్యవహరించి" ఇజ్రాయిల్ తన దాడుల మధ్య కొద్ది విరామం పాటించాలని మాత్రం అమెరికా కోరింది! బహుశా అమెరికా దృష్టిలో మానవతా దృక్పథం అంటే కాల్పులలో మరణించినవారి మృతదేహాలను, గాయపడిన ప్రజలను వేరే చోట్లకు తరలించడానికి అప్పుడప్పుడు కాల్పులను ఆపడమే కాబోలు.

గాజా వంటి ప్రాంతాలను బహిరంగ చెరసాలలుగా ఎంతోకాలం పాటు కొనసాగించడానికి ఇజ్రాయిల్ అంత సుముఖంగా ఉంటుందని భావించలేం. పాలస్తీనా ప్రజల ఉనికే తమ భద్రతకు ముప్పు అని ఇజ్రాయిల్ భావిస్తోంది. అందుచేత ఇజ్రాయిల్ దూకుడు ఇలానే కొనసాగితే అది పాలస్తీనా జాతి మొత్తాన్ని తుడిచిపెట్టేవరకూ ఆగదు. ఇజ్రాయిల్‌కు చెందిన నిర్మాణ సంస్థలు తమ వద్ద పని చేస్తున్న పాలస్తీనీయుల స్థానే భారతీయ కార్మికులను నియమించాలని కోరుతున్నాయి. అంటే మూడవ ప్రపంచదేశాల్లో భారీగా నిరుద్యోగులు ఉన్నంతకాలమూ పాలస్తీనా ప్రజలను గాని, మరేదైనా జాతి ప్రజలను గాని నిర్మూలించడం సామ్రాజ్యవాదులకు పెద్ద ఇబ్బంది కలిగించదు.

ఈ "వలసవాద సామ్రాజ్యవాదం" వర్తమాన సామ్రాజ్యవాద దశలో అత్యంత క్రూరమైన, దూకుడు కలిగిన భాగంగా ఉంది. పైగా తన దుర్మార్గాన్ని అది గత కాలంలో తమపై సాగిన హింస, వేధింపుల సాకుతో సమర్ధించుకుంటోంది. అందుచేత ఈ తరహా వలసవాద సామ్రాజ్యవాదాన్ని నిలవరించాలి. కేవలం పాలస్తీనా ప్రజల కోసమే గాక యావత్ ప్రపంచ ప్రయోజనాల రక్షణ రీత్యా ఇది అత్యవసరం. కేవలం ప్రపంచ ప్రజానీకపు ఒత్తిడితోనే ఇది సాధ్యపడుతుంది. కొలంబియా, బొలీవియా, దక్షిణాఫ్రికా తదితర దేశాలు ఇప్పటికే ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు తెంచుకున్నాయి. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా ప్రపంచమంతటా ప్రజాభిప్రాయం వ్యక్తమౌతోంది. పలు సంపన్న పశ్చిమ దేశాల్లో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ ప్రదర్శనల్లో ఇటీవల కాలంలో ఎన్నడూ చూడనంత పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొంటున్నారు. స్థానికంగా ఉంటున్న యూదుప్రజలు సైతం ఈ ప్రదర్శనలకు మద్దతు పలుకుతున్నారు. ఇజ్రాయిల్ మారణకాండను ఖండిస్తున్నారు. వెల్లువెత్తుతున్న ఈ ప్రపంచవ్యాప్త ప్రతిఘటన మీద పాలస్తీనా ప్రజల భవిష్యత్తు మాత్రమే గాక యావత్ ప్రపంచ ప్రజల భవిష్యత్తు కూడా ఆధారపడి వుంది.

> పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదం మద్దతు గనుక లేకపోతే ఇజ్రాయిల్‌లో వలస సామ్రాజ్యవాదం ఉండేదే కాదు. యూదులను శతాబ్దాలపాటు హింసకు, వేధింపులకు గురిచేసిన సామ్రాజ్యవాదులు తాము అంతకాలమూ కొనసాగించిన పాపాన్ని కడిగేసుకోడానికి ఇజ్రాయిల్‌కు మద్దతు కొనసాగిస్తున్నారు. ఆ క్రమంలో పాలస్తీనా ప్రజలను బలి చేస్తున్నారు. ఇజ్రాయిల్ లోని మితవాద శక్తులు చెలాయిస్తున్న వలసవాద సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సమర్ధించుకోడానికి గతంలో యూదుల మీద సాగిన హింస ఒక సాకుగా ఉపయోగపడుతోంది. ఆ ముసుగులో వాళ్ళు తమ విస్తరణను, వివక్ష పూరిత విధానాలను, జాతుల నిర్మూలనను కొనసాగిస్తున్నారు. పైగా ఇజ్రాయిల్ దుర్మార్గాలను ప్రశ్నించేవారిని "యూదు వ్యతిరేకులు"గా ముద్ర వేస్తున్నారు. ఆ నాటి నాజీలు ప్రదర్శించిన యూదు వ్యతిరేకతతో సరిపోల్చుతున్నారు.

(స్వేచ్ఛానుసరణ)

చాకిరీకి భారతీయులే కావాలా?

పెట్టుబడిదారులకు వత్తాసు పలికి, విశ్వగురువులమని చెప్పుకునే పాలకులే కాదు ప్రజల పక్షాన నిలబడవలసిన పాత్రికేయులు శేఖర్ గుప్తా లాంటి వాళ్ల కూడా "సంపద సృష్టికర్తలు బడా కార్పొరేట్లు" అని దురదృష్టవశాత్తు సెలవిస్తారు. మరి అలాంటప్పుడు, పాలస్తీనీయులను తుద ముట్టించి శ్మశానాన్ని తలపించేలా అక్కడి భూభాగాన్ని తయారు చేసిన ఇజ్రాయిల్ పాలకులు భారతదేశం నుండి లక్ష మంది కార్మికులు కావాలని అర్జీ ఎందుకు పెట్టుకున్నారు? భూమిని భుక్తిగా మార్చగలిగిన శక్తి కేవలం కార్మికులకే ఉందన్నదని ఎప్పటికైనా గుర్తించాల్సిందే! అయితే భారతదేశం నుండే కార్మికులు కావాలని ఎందుకు అడిగినట్లు? సమాధానం చాలా సింపుల్. భారతదేశ కార్మిక వర్గం కిమ్మనకుండా ఇచ్చినంత తీసుకొని కావలసినంత పనిచేసి పెట్టగలదు. చరిత్రలో జార్ చక్రవర్తుల నుండి మొదలు, అనేకమంది రాజులు, రారాజులు మనుషులను బానిసలుగా చూసిన సంఘటనలు అనేకం. విద్యుత్‌కు అంతరాయం కలిగినప్పుడు ఖైదీలుగా ఉన్న వారందర్నీ కట్టగట్టి కిరోసిన్ పోసి వెలిగించి ఆ వెలుగులో భోజనం చేసిన సంఘటనలు నీరో చక్రవర్తి కాలంలో జరిగాయని చరిత్ర చెబుతోంది. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో భారతదేశానికి ఎలాంటి ప్రత్యక్ష సంబంధము లేదు. కానీ బ్రిటీష్ వారి ఆదేశాల మేరకు సుశిక్షితులైన భారత సైనికులను ఎంతోమందిని జర్మనీ పంపించి పొట్టనబెట్టుకున్నారు. అంతెందుకు 30,40 ఏండ్ల క్రితం వచ్చిన సినిమాలలో భారతదేశం నుండి రంగూన్‌కి, అండమాన్ నికోబార్ దీవులకి, అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాలకి మనుషులను శాశ్వతంగా తరలించుకుపోయి బానిసలుగా పని చేయించుకొని వయసు పైబడగానే సజీవంగా నీళ్లలో పడేయడమో లేదా మట్టిలో పూడ్చి వేయడమో చేయడం అనేక సినిమాల్లో చూశాం. ఇలాంటి ఘటనల నేపథ్యంలోనే ఇజ్రాయిల్ పాలకుల కోరికను చూడవలసి ఉంటుంది. అందుచేతనే కాబోలు భారత కార్మిక వర్గంలోని ప్రధాన వామపక్షం ఈ వినతిని పూర్తిగా ఖండించింది. కానీ కొందరు కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పాడే వాళ్లు, పాలకవర్గంలోని పెట్టుబడిదారుల అనుయాయులు ఇజ్రాయిల్ ఆహ్వానాన్ని ఒక అవకాశంగా చూడాలని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.



జి.తిరుపతయ్య
9951300016

ఈనాటి ఇజ్రాయిల్ పాలస్తీనా వివాదానికి కారణం కూడా ఒకనాడు ఇలాంటి వలసలను ప్రోత్సహించి, కొందరిని అక్కడికి పిలిపించి స్థావరాలు ఏర్పరచడం వల్లనే అనేది దాచేస్తే దాగని సత్యం. వివాదాస్పద ప్రదేశానికి అమాయక ప్రజలను ఉపాధి ఆశ చూపి పిలిపించి బలిజేసే కుట్రలో భాగమే ఇది. పిలిపించిన, పంపించిన ప్రభుత్వాలు, అధికారులు ఎలాంటి బాధ్యత వహించే అవకాశం ఉండదు. అధికారికంగా వీసాలు పొంది అమెరికా, సౌదీ అరేబియా, దుబాయ్ లాంటి ప్రాంతాలలో ఉపాధిపై వెళ్లిన వారిలో అనేకమంది జైళ్లల్లో మగ్గుతున్నారు. ఈ సంఖ్య వేలల్లో ఉన్నది. చేయని నేరాలకు చిన్న చిన్న తప్పులకు అనేకమంది ఆయా దేశాల చట్టాల ప్రకారం జైళ్లల్లో ఇరుక్కుపోయారు. ఇక్కడ నివసిస్తున్న వారి కుటుంబాలు ఎంతలా మొరపెట్టుకున్నా యంత్రాంగం పట్టించుకోని సంఘటనలు ఎన్నో ఉన్నవి. ప్రపంచీకరణను అక్కున చేర్చుకున్న భారత పాలకులు, తెలియని భ్రమలతో వారిని అభిమానించే ప్రజలు, ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. ఆంగ్లేయులు ఇండియాను పరిపాలించినప్పుడు ఇక్కడి నుండి ముడిసరుకు తీసుకొని వెళ్లి తయారైన వినియోగ వస్తువులను మళ్లీ ఇక్కడికి తీసుకువచ్చి వ్యాపారం చేసేవారని చదువుకున్నాం. మరి దాని అర్థం ఏమిటి? అంటే.. ఇక్కడ మనుషులు ఇక్కడి వస్తువులు ఇతర దేశాలకు వెళ్లి అక్కడ వినియోగ వస్తువులను తయారు చేయాలి వాటిని ప్రపంచమంతా మార్కెట్ చేసుకోవాలి. ఎక్కడైతే వస్తువులు తయారు చేయబడతాయో ఆ దేశానికి సదరు వస్తువులు చౌకగా లభిస్తాయి. పరిశ్రమలు స్థాపించుకోవడం వల్ల స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలతో పాటు స్థానిక ప్రభుత్వాలకు కావలసినంత ఆదాయం పన్ను రూపంలో లభిస్తుంది. ఇప్పుడు కూడా జరుగుతున్న తతంగం ఇదే. లక్షల మంది టాలెంట్ గలిగిన యువత భారతదేశం నుండి విదేశాలకు తరలిపోతుంటుంది. ఎందుకు? ఎందుకంటే అక్కడ పరిశ్రమలను స్థాపించుకున్నారు. గుర్తు పెట్టుకోండి.. సంస్థలు, ప్రపంచ ఆధిపత్యం సాధిస్తున్న దేశాలు. పరిశ్రమలు నెలకొల్పాలంటే కార్మికులు పుష్కలంగా లభించాలి. భారతదేశంలో కార్మికులు ఉన్నప్పటికీ వీరిని వీసాలకు తీసుకువెళ్లి అక్కడ సంస్థలు స్థాపించుకొని అక్కడ దేశాలకు పన్నులు కట్టించుకుని కార్మికులకు మాత్రం ముష్టి పడవేస్తున్నారు. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో నెలకొల్పబడుతున్న కార్పొరేట్ కంపెనీల ఆఫీసులన్నీ కేవలం శాటిలైట్ ఆఫీసులో లేదా అవుట్‌లెట్ విభాగాలకు చెందినవి మాత్రమే. అమెరికా, జపాన్, చైనా, జర్మనీ, కెనడా, కొరియా వంటి దేశాల్లోనే ఉత్పాదక యూనిట్లు వున్నవి. కార్ల తయారీ కంపెనీ కియా అనంతపురంలో అసెంబ్లీ ఫిటింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే వేల మందికి ఉపాధి లభించింది. అదే ఉత్పత్తి కంపెనీ ఏర్పాటు చేస్తే మరెంతమేర అభివృద్ధి జరుగునో ఊహించండి. "భారత మా ర్కెట్ వినియోగ మార్కెట్- భారత కార్మికులు ఉపయోగపడే మనుషులు" అనే విధంగా ప్రపంచ దేశాల పోకడ ఉన్నది. మొన్న చంద్రయాన్ సఫలమైన సందర్భంగా భారతదేశం నుండి ప్రధాన విద్యా సంస్థల్లో చదువుకుని నిష్ణాతులైన వారందరూ విదేశాలకు వెళ్ళి పోతే మిగతావారు మాత్రమే ఇస్రోలాంటి చోట పనిచేస్తున్నారని వార్త మాధ్యమాలు వేలెత్తి చూపేయి. అయితే భారతదేశంలో చెల్లించబడుతున్న వేతనాల కంటే విదేశాల్లో రెట్టింపుకు పైగానే ఉన్నందువల్ల అట్లాంటి మేధో సంపత్తి తరలిపోతున్నది. స్థానికంగా పరిశ్రమలను నెలకొల్పడమే దీనికి సరైన సమాధానం.

ఆశ్రిత పెట్టుబడిదారీతనాన్ని ఆసరాగా చేసుకుని అందలమెక్కిన ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి పరిశ్రమల స్థాపనపై, భారత మేధోసంపత్తి తరలిపోతున్న అంశంపై మాట్లాడకుండా వారానికి 70 గంటలు యువత పనిచేయాలని విసుర్లు విసరడంతో పెద్ద దుమారమే రేగింది. ఎన్ని గంటలు అన్నది కాదు మనుషుల శక్తిని పూర్తి మొత్తంగా గ్రహించుకోగల సంస్థల స్థాపన నేటి అవసరం. వారి శ్రమకు తగిన ప్రతిఫలాన్ని ఇవ్వడం కూడా అంతే ముఖ్యం. ఈ దేశ నగ్నసత్యం ఏమంటే ఎక్కువ గంటలు పనిచేసిన వారందరూ కడుపేదలుగా మిగిలిపోతున్నారు. వ్యవసాయ సంబంధిత వ్యవహారాలపై ఆధారపడిన వారు రోజుకు కనీసం 16 గంటలు పని చేస్తున్నారు. వారందరూ అత్యంత పేదలు. అసంఘటిత రంగంలోని కార్మికులందరూ 12 గంటలు పని చేస్తున్నారు. వారందరి జీవితాలు తెల్ల రేషన్ కార్డును దాటి ముందుకు పోవడం లేదు. తెల్లకాలర్ తో 6-8 గంటలు పనిచేస్తున్న ఉద్యోగుల జీవితాలు కాస్త మెరుగ్గా ఉన్నవి. నీలిరంగు చొక్కాలతో చలువ కళ్లద్దాలతో చకచకా వ్యవహారాలను చక్కబట్టే వాళ్ల కోటీశ్వరులు. నలగని ఖద్దరుతో నలుగురిపై ఆధిపత్యం చెలాయిస్తున్న వారంతా రాజకీయ పెట్టుబడిదారీ కుమ్మక్కైన వర్గం. ఇప్పుడు చెప్పండి జీవితాలను భవిష్యత్తును నిర్ణయించేది పని గంటలా, పైరవీలా? పైరవీలకు చరమగీతం పాడి పరిశ్రమల్ని నెలకొల్పి ఆ పరిశ్రమలలో కావలసిన నైపుణ్యాన్ని అనువుగా వినియోగించుకునే వ్యవస్థీకృత అంశాలను వదిలి ఉపరితలపు ఉన్నతి కోసం ప్రయత్నిస్తే నిరుపయోగమే.

గత సంవత్సర కాలంగా దాదాపు అన్ని అభివృద్ధి చెందిన దేశాల్లోనూ మాంద్యం పరిస్థితులు నెలకొన్నవి. కొన్ని ప్రధాన కంపెనీలు లేఆఫ్‌లనూ ప్రకటిస్తున్నాయి. అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, కెనడా వంటి దేశాలకు ఉన్నత విద్యకోసం వెళ్ళిన విద్యార్థులు కావలసిన ఉపాధి లభించక దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. యూనివర్సిటీల మనుగడ కోసం కావలసినన్ని వీసాలు మంజూరు చేసి తదనంతర ఉపాధిపై ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. విద్యార్థులను విదేశాలకు పంపించిన ఇక్కడి ప్రభుత్వాలు కూడా సదరు విద్యార్థుల భవిష్యత్తుపై పట్టించుకోవడం లేదు. ఎఫ్ వన్ వీసాల గడువు ముగుస్తుందని కొందరు, హెచ్ వన్ వీసాలు దొరకడం లేదని ఇంకొందరు దిగులుతో ఉన్నారు. ఇలాంటి వారి భవిష్యత్తే అగమ్యగోచరమైనప్పుడు ఇక ఇజ్రాయిల్ దేశం వెళ్ళాల్సిన లక్ష మందికి ఏ కార్మిక చట్టాలు అమలౌతాయో, జీతభత్యాల విధివిధానాలేమిటో కొంత కాలం గడిచిన తరువాత గాని స్పష్టమవదు.

> గత సంవత్సర కాలంగా దాదాపు అన్ని అభివృద్ధి చెందిన దేశాల్లోనూ మాంద్యం పరిస్థితులు నెలకొన్నవి. కొన్ని ప్రధాన కంపెనీలు లేఆఫ్‌లనూ ప్రకటిస్తున్నాయి. అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, కెనడా వంటి దేశాలకు ఉన్నత విద్యకోసం వెళ్ళిన విద్యార్థులు కావలసిన ఉపాధి లభించక దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. యూనివర్సిటీల మనుగడ కోసం కావలసినన్ని వీసాలు మంజూరు చేసి తదనంతర ఉపాధిపై ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. విద్యార్థులను విదేశాలకు పంపించిన ఇక్కడి ప్రభుత్వాలు కూడా సదరు విద్యార్థుల భవిష్యత్తుపై పట్టించుకోవడం లేదు. ఎఫ్ వన్ వీసాల గడువు ముగుస్తుందని కొందరు, హెచ్ వన్ వీసాలు దొరకడం లేదని ఇంకొందరు దిగులుతో ఉన్నారు.



> ఆశ్రిత పెట్టుబడిదారీతనాన్ని ఆసరాగా చేసుకుని అందల మెక్కిన ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి పరిశ్రమల స్థాపనపై, భారత మేధోసంపత్తి తరలిపోతున్న అంశంపై మాట్లాడకుండా వారానికి 70 గంటలు యువత పనిచేయాలని విసుర్లు విసరడంతో పెద్ద దుమారమే రేగింది. ఎన్ని గంటలు అన్నది కాదు మనుషుల శక్తిని పూర్తి మొత్తంగా గ్రహించుకోగల సంస్థల స్థాపన నేటి అవసరం.







సీపీఐ(ఎం)అభ్యర్థులకు జననీరాజనం

బీకనీర్ :రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం)అభ్యర్థులకు ఘనస్వాగతం లభిస్తోంది. బీకనీర్‌లోని దున్‌గర్‌ఘర్‌లో నిర్వహించిన జన ఆశీర్వాద యాత్రకు గ్రామస్తులు పూలవర్షం కురిపించారు. దున్‌గర్‌ఘర్ నియోజకవర్గ సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగిన కామ్రేడ్ గిర్ధారి మహియాకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ సందర్భంగా ఆయన గిర్ధారి మహియా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేశానని, ఇంకా కొన్ని సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈసారి తనను గెలిపిస్తే అన్ని సమమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇస్తున్నారు.



భద్రలో ఎర్రకెరటం రెపరెపలు

కొనసాగించేందుకు బల్వాన్ పునియా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అది హెూలీ అయినా దీపావళి అయినా రాజస్థాన్‌లో ఏదైనా పండుగ రోజున బయటకు వెళ్లి 'రామ్ రామ్' అంటూ మిఠాయిలు పంచుకుంటూ ప్రేమను పంచుకోవడం ఆనవాయితీ. దీపావళి మరుసటి రోజు హర్యానాకు ఆనుకుని ఉన్న హనుమాన్‌గఢ్ జిల్లాలోని భద్ర అనే చిన్న పట్టణంలో మెడలో సీపీఐ(ఎం) అని రాసి ఉన్న ఎర్రటి శాలువాలు ధరించిన ఒక సమూహం రద్దీగా ఉండే వీధుల్లో కదులుతుంది. భద్ర సీపీఐ(ఎం) అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బల్వాన్ పునియా వారి ముందు చేతులు జోడించారు. దీపావళి మరుసటి రోజున అభ్యర్థి ఓటర్లను స్వయంగా కలుసుకుని 'రామ్ రామ్' అంటూ ప్రేమను పంచుతున్నారు.

బల్వాన్ పునియాకు తోడుగా ఉన్న కార్మికులలో గులాబ్ ఖాన్ ఒకరు. ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడిగా ఉన్నారు. భద్ర సీటును పునియా నిలబెట్టుకుంటారనడంలో సందేహం లేదని గులాబ్ ఖాన్ అన్నారు. ఎమ్మెల్యే ఐదేండ్ల సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలే ఆత్మస్థైర్యానికి పునాది. పునియా, ఆయన బృందం వీధుల గుండా వెళ్లడాన్ని చూసిన కొంతమంది ప్రజలు గులాబ్ ఖాన్ అభిప్రాయాన్ని ధ్రువీకరించారు. బీజేపీ, సీపీఐ(ఎం) మధ్యే ప్రధాన పోటీ అని అందరూ ఏకగ్రీవంగా చెప్పారు. బీజేపీకి చెందిన సంజీవ్ బనివాల్ కూడా ముందున్న వారు కూడా ఏది ఏమైనా పోటీ సినిమాలో కాంగ్రెస్‌కు చెందిన అజిత్ బనివాల్‌కి ప్రాధాన్యం లేదని అంటున్నారు.

బీజేపీకి చెందిన సంజీవ్ బనివాల్ భద్ర నుంచి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించారు. 1998లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచారు. 2013లో బీజేపీ అభ్యర్థిగా గెలుపొందారు. సంజీవ్ తండ్రి, తాత వివిధ పార్టీల నుంచి భద్రకు ప్రాతినిధ్యం వహించారు.

బల్వాన్ పునియా ఎస్ఎఫ్ఐతో ప్రజా రంగంలోకి ప్రవేశం చేశారు. హనుమాన్‌గఢ్ నుండి లోక్‌సభకు సీపీఐ(ఎం) తరపున ప్రాతినిధ్యం వహించిన రైతు నాయకుడు షోపత్ సింగ్ పునియా రాజకీయ గురువు. భద్రలో అనేక రైతాంగ తిరుగుబాట్లకు నాయకత్వం వహించారు. 2006లో జరిగిన రైతుల ఆందోళనలో పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. అప్పుడు ఆరు నెలల జైలు శిక్ష అనుభవించారు. అదే ఏడాది భద్ర జిల్లా పరిషత్ నుంచి సీపీఐ(ఎం) టికెట్‌పై గెలుపొందారు. ఇదే భద్రలో సీపీఎం తొలి విజయం. 2008లో శాసనసభకు జరిగిన తొలి పోటీలో 14,000 ఓట్లకు పైగా గెలుపొందారు. 2013లో 38,000 ఓట్లు పెరిగి రెండో స్థానంలో నిలిచాయి. 2018లో 82,000 ఓట్లకు పైగా గెలుపొందారు. బీజేపీ అభ్యర్థి సంజీవ్‌పై 22,500 ఓట్ల తేడాతో విజయం సాధించారు. కాంగ్రెస్ మూడో స్థానంలో నిలిచింది. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జెపి దత్త మాట్లాడుతూ ఈసారి లక్షకు పైగా ఓటర్లను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

రైతుల మద్దతుతో గెలుపు ఖాయం

ఎమ్మెల్యేగా విద్యా, వైద్యానికే ప్రాధాన్యత

- సీపీఐ(ఎం) అభ్యర్థి బల్వాన్ పునియా
- 22న ఏచూరి రోడ్ షో...లక్ష మంది సమీకరణ

లసీపీఐ(ఎం) జిల్లా కమిటీ కార్యాలయం (కిసాన్ భవన్)లో ప్రచార హడావుడి ఉన్నప్పటికీ బల్వాన్ పునియా నవ తెలంగాణ ప్రతినిధికి ఫోన్‌లో అందుబాటులోకి వచ్చారు. పునియా గెలుపుపై పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. రెండు రౌండ్ల పర్యటన ముగిసింది. దీపావళి ముగియనుండడంతో రానున్న రోజుల్లో ప్రచారం మరింత ఉధృతంగా సాగనుంది. నవంబర్ 22న సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొనే వ్యాన్ ర్యాలీలో లక్ష మందిని సమీకరించనున్నట్టు పునియా తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌లు భారీ ధన ప్రవాహంతో ప్రచారం చేస్తున్నాయి. కిందిస్థాయి కార్యకర్తలే సీపీఐ(ఎం)కు బలం. ఎప్పుడూ రైతులకు అండగా నిలిచారు. రైతులకు నీరు, కరెంటు, పంటల బీమా కల్పించాలంటూ అనేక ఆందోళనలు జరిగాయి. వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా భద్రా రైతులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. అసెంబ్లీలో కూడా వారి హక్కుల కోసం మాట్లాడాం. భద్రలో 80 శాతం మంది రైతులే. దానికి సామాన్య కార్మికులు మద్దతు ఇస్తారని నేను నమ్ముతున్నాను.

ఎమ్మెల్యేగా విద్యా, వైద్యానికే ప్రాధాన్యత

"ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గంలో నాలుగు కొత్త కళాశాలలు, అనేక పాఠశాలలు ప్రారంభమయ్యాయి. 30 పడకలు మాత్రమే ఉన్న ఉప జిల్లా ఆస్పత్రిని వంద పడకల పెద్ద ఆస్పత్రిగా విస్తరించాం. గ్రామాల్లో మరిన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించాం. 330 కిలోమీటర్ల మేర కొత్త రహదారులను అభివృద్ధి చేశాం. రైతులకు అందించే పంటల బీమాను నాలుగు రెట్లకు పైగా పెంచగలిగాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు అందేలా చూస్తాం. భద్ర ప్రజలు తనను వదులుకోరన్న నమ్మకంతో ఉన్నా" అని పునియా అన్నారు.

"భద్రలో 2.74 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో సంస్థాగత ఎన్నికలు జరిగిన ఎనిమిది కళాశాలల్లోనూ ఎస్ఎఫ్ఐ సంపూర్ణంగా గెలిచింది. మొత్తం 27 పంచాయతీ సమితులలో 17 స్థానాలు సీపీఎం ఆధీనంలో ఉన్నాయి. ఐదు జిల్లా పరిషత్ స్థానాలకు గాను సీపీఐ(ఎం) రెండు స్థానాలను గెలుచుకుంది. భద్ర మున్సిపల్ అసెంబ్లీలో బీజేపీని ఓడించేందుకు సీపీఐ(ఎం), కాంగ్రెస్‌లు అంగీకారం తెలిపాయి. బీజేపీ గెలవలేకపోయింది" అని అన్నారు.

చురులో బృందాకరత్ ప్రచారం



జైపూర్ : రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా నాలుగు రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో అన్ని రాజకీయ పార్టీలు ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. సోమవారం రాజ్‌గఢ్ జిల్లాలోని చురు పట్టణంలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ ప్రచారం నిర్వహించారు. భారీ బహిరంగ సభలో బృందాకరత్ ప్రసంగిస్తూ చురు నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న సీపీఐ(ఎం) అభ్యర్థి సునీల్ పునియాకు ఓటు వేయమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి సీపీఐ(ఎం) నాయకులు మైచంద్ బాగోరా అధ్యక్షత వహించారు. ఈ సభలో కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్ సింగ్, రాజ్‌గఢ్ జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శి నిరుపమ్ కుమార్, అభ్యర్థి సునీల్ పునియా కూడా ప్రసంగించారు. ఈ సభకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రాజస్థాన్‌లో ఈ నెల 25న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది.


సీపీఐ(ఎం) అభ్యర్థులకు పెరుగుతున్న ఆదరణ

బహిరంగ సభలకు జనం హాజరు



రాజస్థాన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థులకు మద్దతు పెరుగుతుంది. అభ్యర్థులకు వివిధ ప్రాంతాల్లో బహిరంగ సభలు, ప్రదర్శనలు జరిగాయి. ధోడ్‌లో జరిగిన భారీ 'విజయ ప్రతిజ్ఞ' బహిరంగ సభలో సీపీఐ(ఎం) అభ్యర్థి పేమా రామ్‌కు మద్దతుగా వేలాది మంది తరలివచ్చిన ప్రజలు "విజయం మనదే" అని ప్రతిజ్ఞ పూనారు. ఈ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి అమ్రా రామ్, నాయకుడు కిషన్ పరీక్ ప్రసంగించారు. బికనీర్ జిల్లా దుంగర్గర్ లో జన ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. దుంగర్గర్ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) అభ్యర్థి గిరిధరి విజయాన్ని ఆకాంక్షిస్తూ చేపట్టిన ర్యాలీలో భారీస్థాయిలో రైతులు పాల్గొన్నారు. ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. సదుల్పూర్ సీపీఐ(ఎం) అభ్యర్థి సునీల్ పునియాకి మద్దతుగా భారీ బహిరంగ సభ జరిగింది.

ములుగులో మావోయిస్టుల కదలికలపై డీజీపీ ఆరా



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : ఉత్తర తెలంగాణలోని ములుగు జిల్లాలో మావోయిస్టుల కదలికలు సాగుతున్నాయనే సమాచారంతో రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ములుగులో మావోయిస్టు లోకల్ ఘెరిల్లా స్క్వాడ్ (ఎల్‌జీఎస్) ఒకటి సంచరిస్తున్నదనే సమాచారంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ సోమవారం ఆరా తీశారు. మావోయిస్టు ప్రభావిత ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి సరిహద్దులను దాటి ములుగులోకి వీరు ప్రవేశించారనే కోణంలో యాంటీ నక్సలైట్ విభాగం అధికారులు నిశితంగా దృష్టిని సారించి గాలింపు చర్యలను ఉధృతం చేసినట్టు తెలిసింది. ఎన్నికల ప్రచార పర్వం చివరి అంకంలో ఉండటం, వివిధ పార్టీల రాజకీయ నాయకులు విస్తృతంగా జిల్లాల్లో పర్యటిస్తుండటంతో దీనిని ఆసరాగా చేసుకొని మావోయిస్టులు ఏదేనీ విధ్వంసానికి పాల్పడే ప్రమాదమున్నదని ఇంటెలిజెన్స్ విభాగం సైతం హెచ్చరించినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ములుగు సరిహద్దుల్లో గాలింపు చర్యలను ఉధృతం చేయాలని గ్రేహౌండ్స్ బలగాలను డీజీపీ ఆదేశించినట్టు సమాచారం. అదే సమయంలో రాజకీయ ప్రముఖుల భద్రత విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కూడా డీజీపీ ఆదేశించినట్టు తెలిసింది.

నగర కమిషనర్‌కు స్వల్ప అస్వస్థత

హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య సోమవారం స్వల్ప అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆయన తన కార్యాలయంలో అధికారులకు ఎన్నికల బందోబస్తుకు సంబంధించి కొన్ని సూచనలు చేస్తున్న సమయంలో ఆయనకు ఒక్కసారిగా కళ్లు తిరిగినట్టై కుర్చీలో కూర్చున్నారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు డాక్టర్లను పిలిచి పరిశీలించగా ఆయన లోబీపీకి గురైనట్టు తేలింది. దాంతో ఆయనను స్థానిక అపోలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స జరిపాక కొంత విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. అనంతరం ఆయన తన నివాసానికి వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. ఎన్నికల విధి నిర్వహణ కోసం ఇటీవలనే కేంద్ర ఎన్నికల కమిషన్ సందీప్ శాండిల్యను నగర పోలీసు కమిషనర్‌గా నియమించి ఆ స్థానంలో ఉన్న సి.వి ఆనంద్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. కాగా, తాను మంగళవారం విధులకు హాజరవుతాననీ సందీప్ శాండిల్య తోటి అధికారులకు తెలిపారు.



పోరాటాలతోనే సబ్‌ప్లాన్ చట్టం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర జనాభాలో 15.45 శాతం ఎస్సీలున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వీరు అట్టడుగున ఉన్నారు. వీరి అభివృద్ధి కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులను మాత్రమే కేటాయించేది. ఆ నిధులను కూడా దళితుల అభ్యున్నతికి ఖర్చు పెట్టేది కాదు. దీంతో వారి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండేది. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం), కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘంతో పాటు మేధావులు, ఇతర 102 సంఘాలు ఐక్య వేదికగా ఏర్పడి సబ్‌ప్లాన్ చట్టం కోసం నిర్విరామ పోరాటాలు చేశాయి. బీవీ రాఘవులు, జాన్‌వెస్లీ తదితరులు నిరవధిక దీక్షలకు పూనుకున్నారు. పోరాటాల ఉధృతికి తలవంచిన ప్రభుత్వం...సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ చట్టం ద్వారా బడ్జెట్‌లో షెడ్యూల్ కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి వారి అభివృద్ధి కోసం ఖర్చు చేసే వ్యవస్థ ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పాటయింది.ఎస్సీ అభివృద్ధి నిధికి కేటాయించిన నిదులు సుమారు 54 శాఖల ద్వారా ఖర్చు చేసే యంత్రాంగం ఉండేది. ఈ ఏడాది ఖర్చు చేయని నిధులను మరుసటి సంవత్సరం ఖర్చు చేసే విధంగా క్యారీ ఫారవడ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా నాడు ప్రభుత్వం ప్రకటించింది. పోరాటం ఫలితంగా సాధించిన గొప్ప విజయమిది. అయితే కేసీఆర్ ప్రభుత్వం దళితుల అభివృద్ధి గురించి గొప్పలకు పోతున్నది. వారికోసం కేటాయించిన నిధులను మాత్రం ఖర్చు చేయకుండా చట్ట విరుద్ధంగా దారి మళ్లిస్తున్నది.

> అమలులో ప్రభుత్వం వైఫల్యం
> చట్టాలను, పథకాలను నిర్వీర్యానికి ప్రయత్నం
> నిరంతరం పోరాడుతున్న కేవీపీఎస్

2014నుంచి 2022-23 (సెప్టెంబర్ 30 వరకు) మధ్యకాలంలో ఎస్సీల అభివృద్ధి నిధి కింద రూ. 1,41,160.37 కోట్లు కేటాయి ంచగా రూ.77,978.27కోట్లు అంటే 55శాతం మాత్రమే ఖర్చు చేసింది. సుమారు రూ.63,182.10 కోట్లు దారి మళ్లాయి.

పెరుగుతున్న దాడులు..

గత తొమ్మిదేండ్ల కాలంలో రాష్ట్రంలో దళితులపై దాడులు దౌర్జన్యాలు పెరిగాయి. 86 కుల దురహంకార హత్యలు జరిగాయంటే పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంబోజ్ నరేశ్, పెరుమాండ్ల ప్రణయ్, మంథని మధుకర్ ఇలా అనేక మంది కుల దరహంకారంతో అతి ధారుణంగా హత్యగావించబడ్డారు. ఈ హత్యలకు వ్యతిరేకంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నికరంగా పోరాడింది. ఐక్య పోరాటాల్లో ముందు పీఠిన నిలబడింది. పోరాటాల ఫలితంగానే దోషులపై చట్టబద్ధ చర్యలు తీసుకున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ దోషులను కాపాడేందుకు ప్రయత్నించాయి.

వీడీసీల పేరుతో నిజామాబాద్ జిల్లాలో దళితులను గ్రామ బహిష్కరణకు గురిచేస్తే దానికి వ్యతిరేకంగా కేవీపీఎస్ పోరాటాలు నిర్వహించింది. సంబంధిత వ్యక్తులపై చట్టబద్ధ చర్యలు తీసుకునేలా వత్తిడి చేసింది.

మూలకు పడ్డ మూడెకరాల భూమి..

కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగావ నిర్వహించిన పోరాటాల ఫలితంగా భూమి లేని ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి నినాదాన్ని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చేర్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత 6,242 కుటుంబాలకు 15,571 ఎకరాలు పంపిణీచేసి సర్కార్ చేతులెత్తేసింది.

దళితబంధులో అవినీతి..

దళిత బంధుపథకం ఎమ్మెల్యేలకు వరంలా మారింది. దీంతో లబ్దిదారులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఈ విషయమై 282 మండలాల్లో ధర్నాలు, ఆందోళనలు జరిగాయి. దీంతో అవినీతిని అరికట్టేందుకు ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొస్తున్నట్టు ప్రకటించినప్పటికీ రాజకీయ జోక్యం తొలగిపోలేదు .దీనిపై కేవీపీఎస్ నికరంగా పోరాడుతుంది.

దోషి బీసీసీఐ!

- అన్నీ తెలిసి ఫైనల్‌కు 'స్లో పిచ్'
- టాస్ నెగ్గిన జట్టుకే ఆ అనుకూలత

ఐసీసీ 2023 ప్రపంచకప్

12 ఏండ్ల ప్రపంచకప్ నిరీక్షణకు తెరదించే సువర్ణావకాశం చేజారింది. సొంతగడ్డపై ఓటమెరుగని జైత్రయాత్ర సాగించిన టీమ్ ఇండియా ఫైనల్ ముంగిట వరుసగా 10 మ్యాచుల్లో అప్రతిహాత విజయాలు సాధించింది. టైటిల్ పోరుకు ముందు వరుసగా ఆరు మ్యాచుల్లో ప్రత్యర్థి జట్లను ఆలౌట్ చేసిన భీకర ఫామ్ బౌలింగ్ బృందానిది. తొలుత బ్యాటింగ్ చేస్తే 357, 326, 410, 397 భారీ స్కోర్లు చేసిన రికార్డు బ్యాటింగ్ లైనప్‌ది. అయినా, ఫైనల్లో ఆతిథ్య జట్టు ప్రతిభను భారత క్రికెట్ బోర్డు విశ్వసించలేదా? కీలక తుది సమరానికి 'స్లో పిచ్'ను ఎందుకు సిద్ధం చేసింది?!.

నవతెలంగాణ క్రీడావిభాగం



స్లో పిచ్.. విన్ పిచ్ : టైటిల్ పోరుకు ముందు రోజు అహ్మదాబాద్ పిచ్‌ను పరిశీలిస్తున్న ఆస్ట్రేలియా క్రికెటర్లు

ప్రపంచకప్ సెమీఫైనల్, ఫైనల్స్‌కు ముందు పిచ్‌పై కాస్త చర్చ నడిచింది. ముంబయి వాంఖడేలో న్యూజిలాండ్‌తో సెమీఫైనల్ మ్యాచ్ పిచ్‌ను బీసీసీఐ ఆఖరు నిమిషంలో మార్చివేసింది. కొత్త పిచ్‌పై కాకుండా, గ్రూప్ దశ మ్యాచులకు ఉపయోగించిన పిచ్‌ను ఎంపిక చేసింది. జీవం లేని పిచ్‌పై పరుగుల వరద పారింది. న్యూజిలాండ్ పేసర్లకు స్వింగ్ అనుకూలత తొలగించేందుకు ఈ పని చేసినట్టు సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. విదేశీ గడ్డపై భారత పేసర్లు అసమాన ప్రదర్శనతో పైచేయి సాధిస్తుంటే.. మన పిచ్‌లను ఇంకా పేసర్లకు సహకారం దక్కకుండా రూపొందించే ఆలోచనలో బోర్డు ఉంది. టీమ్ ఇండియా బౌలింగ్ బలం, పేసర్ల సత్తాపై బోర్డుకు అవగాహన లేదా?!. ఫైనల్‌కు ముందు న్యూజిలాండ్ (సెమీస్), నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌లను టీమ్ ఇండియా ఆలౌట్ చేసింది. తొలుత బ్యాట్ పట్టినా, బంతి అందుకున్నా.. మన బౌలర్ల లక్ష్యం ఒక్కటే. ప్రత్యర్థి జట్టును వీలైనంత తక్కువ స్కోరుకు కుప్పకూల్చటమే. ఆ పని చేయటంలో బుమ్రా దళం విజయవంతమైంది. భారత్ తొలుత బ్యాటింగ్ చేసిన మ్యాచుల్లో ఇంగ్లాండ్‌తో మాత్రమే 229 పరుగులు చేసింది. లక్నోలో ఆడిన ఆ మ్యాచ్‌లో స్పిన్నర్లు మాయ చేశారు. ఇంగ్లాండ్‌ను మనోళ్లు 129 పరుగులకే ఆలౌట్ చేశారు. ఇతర మ్యాచుల్లో తొలుత బ్యాటింగ్ చేసి 357, 326, 310, 397.. ఇలా భారీ స్కోర్లు సాధించారు.

స్లో పిచ్ ఓ లక్కీ లాటరీ

భారత్, ఆస్ట్రేలియా ప్రపంచకప్ ఫైనల్‌కు సైతం వాడిన పిచ్‌నే సిద్ధం చేశారు. భారత్, పాకిస్థాన్ గ్రూప్ దశ మ్యాచ్‌కు వినియోగించిన పిచ్‌ను మళ్లీ తుది పోరుకు వాడారు. జట్టు మేనేజ్‌మెంట్ అడిగిందా? బీసీసీఐ పెద్దలు సూచించారా? అనేది తెలియదు. కానీ ఫైనల్‌కు మాత్రం ' స్లో పిచ్' వాడారు. అందుకు భారత్ భారీ మూల్యం చెల్లించుకుంది. ఎందుకంటే స్లో పిచ్ లక్కీ లాటరీ వంటిది. ఈ పిచ్‌పై అదృష్టంతో పాటు టాస్ సైతం కలిసి రావాలి. పగటి వేళ పిచ్‌పై పగుళ్లు తేలి స్పిన్, స్వింగ్‌కు కాస్త అనుకూలిస్తుంది. తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు పరుగులు చేయటం అంత సులువు కాదు. స్లో పిచ్‌పై బంతి పడిన తర్వాత వేగం అమాంతం తగ్గిపోతుంది. బౌన్స్, స్వింగ్, సీమ్ ఏమీ ఉండవు. టెక్నిక్, టైమింగ్‌తో పరుగులు సాధించే బ్యాటర్లకు బంతి వేగం నెమ్మదించటంతో 'కనెక్ట్' కాలేరు. సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్ ఇందుకు నిదర్శనం. స్లో పిచ్‌కు అదనంగా ఆసీస్ ఫీల్డింగ్ వ్యూహం కలిసొచ్చింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం కనిపించింది. మంచు కారణంగా బంతి మెత్తబడింది. ఆరంభంలో పది ఓవర్లలో పేసర్లకు లభించిన 'గ్రిప్' ఆ తర్వాత స్పిన్నర్లకు లభించలేదు. దీంతో ట్రావిశ్ హెడ్, లబుషేన్ అలవోకగా పరుగులు సాధించారు. సాధించాల్సిన రన్‌రేట్ అందుబాటులో ఉండటంతో రిస్క్ తీసుకోవాల్సిన అవసరం ఆస్ట్రేలియాకు ఏర్పడలేదు. దీంతో ఆస్ట్రేలియా ఫైనల్లో విజయం సాధించటం సులువైంది. శ్రీలంక, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌లను స్వల్ప స్కోరుకు కుప్పకూల్చిన మన బౌలర్లు.. ప్రతికూల పరిస్థితుల్లో ఆసీస్ మెడలు వంచలేకపోయారు. అందులో ప్రధాన కారణం రెండు. ఒకటి స్లో పిచ్, రెండోది మంచు. స్లో పిచ్ రూపకర్త బీసీసీఐ. అహ్మదాబాద్ వైఫల్యం ప్రధాన బాధ్యత బోర్డుదే!.



అయినా.. మన జట్టు గొప్పే!

2023 ప్రపంచకప్ విజయం చేజారినా టీమ్ ఇండియాను ఏమాత్రం తక్కువ చేయలేం. ప్రపంచకప్‌ను ఎవరు నెగ్గుతారో తేల్చేందుకే ఐసీసీ టోర్నీలు కానీ.. ప్రపంచ అత్యుత్తమ జట్టు ఎవరనే అంశం తేల్చేందుకు కాదు. ప్రపంచకప్‌లో పోటీపడిన అన్ని జట్లను ఓడించిన టీమ్ ఇండియా రియల్ విన్నర్‌గా నిలిచింది. ప్రపంచ క్రికెట్‌లో ప్రతి జట్టు స్వప్నించే ప్రదర్శన రోహిత్‌సేన గ్రూప్ దశలో సాగించింది. బంతితో, బ్యాట్‌తో, ఫీల్డ్‌లో టీమ్ ఇండియా అసమాన జట్టుగా నిలిచింది. లోప రహిత జట్టుగా ఓ ఐసీసీ టోర్నీలో ఫైనల్ వరకు చేరిన జట్టు టీమ్ ఇండియా ఒక్కటే. 2023 ప్రపంచకప్ వేటను చెపాక్‌లో ఆస్ట్రేలియాపై విజయంతో మొదలెట్టిన టీమ్ ఇండియా.. అహ్మదాబాద్‌లో అదే ఆస్ట్రేలియా చేతిలో ఓటమితో ముగించటం గమనార్హం.

ద్రవిడ్ దారెటు?

చీఫ్ కోచ్‌గా ముగిసిన కాంట్రాక్టు



ముంబయి : 2023 ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్ భావోద్వేగ సన్నివేశాలతో సాగింది. ప్రపంచకప్ పట్టేశామనే భావనలో ఉండిన టీమ్ ఇండియా.. ఆఖరుకు అది ఆస్ట్రేలియా చెంత చెరటంతో భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోలేకపోయారు. పేసర్ మహ్మద్ సిరాజ్ కంట నీరు పెట్టగా.. రోహిత్ శర్మ కంటి వెనుక బాధను అదుపు చేసుకునే ప్రయత్నం చేశాడు. విరాట్ కోహ్లి ముఖాన్ని క్యాప్‌లో దాచుకున్నాడు. చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పరిస్థితి అందుకు భిన్నంగా ఏమీ లేదు. సరిగ్గా 20 ఏండ్ల కిందట జొహనెస్‌బర్గ్‌లో ఆటగాడిగా ఇంతకుమించి వేదన అనుభవించిన రాహుల్ ద్రవిడ్.. ఆదివారం చీఫ్ కోచ్‌గా ఓటమి బాధను తీసుకోలేకపోయాడు. టీమ్ ఇండియా చీఫ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ కాంట్రాక్టు ప్రపంచకప్ ఫైనల్‌తో ముగిసింది. కీలక ఆటగాళ్లకు వరుసగా గాయాలు, అత్యధిక మ్యాచుల్లో ద్వితీయ శ్రేణి క్రికెటర్లతోనే నెట్టుకొచ్చిన రాహుల్ ద్రవిడ్ ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా స్వరూపం మార్చివేశాడు. కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం, భారత జట్టు ఆట తీరు సరికొత్త స్థాయికి తీసుకెళ్లాడు. డ్రెస్సింగ్‌రూమ్‌లో క్రికెటర్ల బంధం చూసి సోషల్ మీడియాలో అభిమానులు పండుగ చేసుకున్నారు. అందుకు రాహుల్ ద్రవిడ్‌కు తప్పకుండా ఘనత ఇవ్వాల్సిందే.

రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా టీ20 ప్రపంచకప్, ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో టీమ్ ఇండియా పోటీ పడింది. టీ20 ప్రపంచకప్ వేటకు సెమీస్‌లో తెరపడగా.. టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓటమి ఎదురైంది. తాజాగా ప్రపంచకప్ ఫైనల్లోనూ ఆసీస్ కప్పును ఎగరేసుకుపోయింది. ఈ మూడు టైటిళ్లలో ఏ ఒక్క టైటిల్ నెగ్గినా రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా విజయవంతం అయ్యేవారు. 2017 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ వేటలో అనిల్ కుంబ్లే ఆఖరు మెట్టుపై తడబడినట్టే.. రాహుల్ ద్రవిడ్‌కు సైతం చేదు అనుభవమే ఎదురైంది. నవంబర్ 23 నుంచి ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌తో భారత జట్టు ప్రయాణం మళ్లీ మొదలు కానుంది. మళ్లీ కొత్త ప్రణాళికలు, కొత్త లక్ష్యాలు. మరో ఏడాది పాటు చీఫ్ కోచ్‌గా కొనసాగేందుకు రాహుల్ ద్రవిడ్ ఆసక్తి చూపిస్తారా? లేదంటే ప్రపంచకప్ ఓటమితో వైదొలుగుతారా? అనేది చూడాలి. త్వరలోనే బీసీసీఐ పెద్దలతో రాహుల్ ద్రవిడ్ భేటీ కానున్నారు. ఆ తరువాతే భారత జట్టుతో ద్రవిడ్ భవితవ్యం తేలనుంది.



అహ్మదాబాద్‌లోని సబర్మతి నది వద్ద ప్రపంచకప్ ట్రోఫీతో ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్

విన్నర్ జకోవిచ్

ఏటీపీ ఫైనల్స్ టైటిల్ సొంతం

ట్యూరిన్ (ఇటలీ) : ప్రపంచ టెన్నిస్‌లో సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్ (36) ఆధిపత్యం కొనసాగుతోంది. ఈ ఏడాది మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సహా 40వ మాస్టర్స్ 100 ట్రోఫీ సాధించిన జకోవిచ్.. మరో ప్రతిష్టాత్మక టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఇటలీలోని ట్యూరిన్‌లో జరిగిన ఏటీపీ ఫైనల్స్‌లో నొవాక్ జకోవిచ్ విజయం సాధించాడు. లోకల్ హీరో, ఇటలీ స్టార్ జానిక్ సిన్నర్‌పై వరుస సెట్లలో అలవోక విజయం నమోదు చేశాడు. 6-3, 6-3తో సిన్నర్‌ను చిత్తు చేసిన జకోవిచ్ రికార్డు ఏడో ఏటీపీ ఫైనల్స్ ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. 'గత కొన్ని రోజులుగా నా ప్రదర్శన పట్ల గర్వంగా ఉంది.



అల్కారాస్, సిన్నర్‌పై సాధించిన విజయాలు అమోఘం. ఈ ఇద్దరు భవిష్యత్‌లో ఉత్తమ ఆటగాళ్లు కాగలరు' అని జకోవిచ్ అన్నాడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 400వ వారం వరల్డ్ నం.1గా నిలిచి దిగ్గజ రోజర్ ఫెడరర్ రికార్డును జకోవిచ్ అధిగమించారు.



మీ పోరాటం భేష్

ఫైనల్లో ఓటమి అనంతరం భారత జట్టు డ్రెస్సింగ్‌రూమ్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలతో భారత ప్రధాని నరేంద్ర మోడి. టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచి భంగపడిన భారత క్రికెటర్లను ప్రధాని ఓదార్చారు.

పక్కా మాస్ సినిమా



జోజు జార్జ్, వైష్ణవ్ తేజ్

వైష్ణవ్ తేజ్ తాజాగా నటించిన చిత్రం 'ఆదికేశవ'. 'మ్యాడ్'లో నటుడిగా తనదైన ముద్ర వేసిన శ్రీకాంత్ ఎన్ రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను సోమవారం ఏఎంబి మాల్‌లో జరిగిన వేడుకలో విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో వైష్ణవ్ తేజ్ మాట్లాడుతూ, 'ట్రైలర్‌కి వస్తున్న స్పందన చూసి చాలా ఆనందంగా ఉంది. ట్రైలర్ మాదిరిగానే సినిమా కూడా మీ అందరినీ మెప్పిస్తుంది' అని అన్నారు. 'ఇదొక పక్కా మాస్ సినిమా. ఇందులో యాక్షన్, ఎమోషన్, కామెడీ, సాంగ్స్ అన్నీ బాగుంటాయి. 'వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి' తర్వాత వస్తున్న పర్ఫెక్ట్ మాస్ ఫిల్మ్ ఇది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ సినిమా అలరిస్తుంది' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ చిత్రాన్ని ఈనెల 24న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేయనున్నారు.

అథర్వ రిలీజ్‌కి రెడీ



ఓ క్రైమ్‌ను పోలీసులు పరిష్కరించాలంటే క్లూస్ టీం ప్రాముఖ్యత ఎంత ఉంటుంది అనేది సాధారణ ప్రజలకు తెలియదు. ఓ క్రిమినల్‌ను పట్టుకునేందుకు క్లూస్, ఫోరెన్సిక్ డిపార్ట్మెంట్లు పడే కష్టాన్ని చూపించే చిత్రమే 'అథర్వ'. సస్పెన్స్, క్రైమ్ జోనర్‌లో అన్ని రకాల ఎమోషన్స్‌తో తెరకెక్కిం చిన చిత్రమిది. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో పెగ్గో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందింది. కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో,హీరోయిన్లుగా నటించారు.

మహేష్ రెడ్డి దర్శకత్వం వహించగా, సుభాష్ నూతలపాటి నిర్మించారు. విజయ, ఝాన్సీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరించారు. డిసెంబర్ 1న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ మూవీని తాజాగా పోలీస్ డిపార్ట్మెంట్లోని క్లూస్, ఫోరెన్సిక్ విభాగం వారు వీక్షించారు. తెలంగాణ స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరి అడిషనల్ డైరెక్టర్ డా.అనిత ఎవాంజెలిన్ మాట్లాడుతూ, 'మా వాళ్లని హీరోల్లా చూపించారు. ఈ సినిమా మా అందరికీ ఓ నివాళిలా అనిపించింది. మా కష్టాన్ని అందరికీ తెలిసేలా తీసిన ఈ సినిమా పెద్ద విజయాన్ని సాధించాలి' అని అన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్, క్లూస్ జాయింట్ డైరెక్టర్ డా.వెంకన్న మాట్లాడుతూ, 'దర్శకుడు మహేష్ ఈ కథను నాకు ముందు నెరేట్ చేశాడు. సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. చివరి వరకు ఉత్కంఠభరితంగా తీశారు. క్రైమ్ సీన్ ఆఫీసర్ అంటే కార్తీక్ రాజులా ఉండాలనేలా చూపించారు. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది' అని అన్నారు.

నవచిత్రం

రేసీ స్క్రీన్‌ప్లేతో ది ట్రయల్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు లీడ్ రోల్స్‌లో నటించిన సినిమా 'ది ట్రయల్'. ఎస్ఎస్ ఫిలింస్, కామన్ మ్యాన్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై స్మృతి సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించారు. సుదర్శన్ రెడ్డి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. రామ్ గన్ని తెరకెక్కించిన ఈ సినిమా ఈ నెల 24న థియేటర్స్ ద్వారా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రామ్ గన్ని మీడియాతో ముచ్చటించారు.



రామ్ గన్ని

- జైళ్ల శాఖలో డిప్యూటీ జైలర్‌గా పదేళ్లు జాబ్ చేశాను. ఈ పదేళ్ల కెరీర్‌లో ఎన్నో క్రైమ్ ఇన్సిడెంట్స్ గురించి, ఆ క్రైమ్స్ చేసి ఖైదీలుగా ఉన్న వారి కథలను విన్నాను. వాటితోపాటు ఫారిన్‌లో జరిగిన కొన్ని ఇన్సిడెంట్స్ మన దగ్గర అన్వయించుకుంటే ఎలా ఉంటుందని ఫిక్షనల్‌గా రాసుకున్న కథ ఇది. మాది టాలీవుడ్ ఫస్ట్ ఇంటరాగేటివ్ ఫిల్మ్. ఎందుకంటే మొత్తం సినిమా ఇంటరాగేషన్ మీదే ఉంటుంది.
- ఓ జంట ఫస్ట్ వెడ్డింగ్ యానివర్సరీ సెలబ్రేషన్స్ జరుపుకుంటారు. అబ్బాయి ఒక సర్‌ప్రైజ్ ఉంది కళ్లు మూసుకోమని చెబుతాడు. ఆ అమ్మాయి కళ్లు తెరిచేలోగా అబ్బాయి బిల్డింగ్ మీద నుంచి కిందపడి చనిపోతాడు. అతనిది హత్యా ఆత్మహత్యా అనే అంశంతో కథ ఇంట్రెస్టింగ్‌గా సాగుతుంది. ఇంటరాగేషన్ ఆఫీసర్ విచారణ చేస్తున్నది ఒక మహిళ ఎస్ఐని అయితే వారి మధ్య సంభాషణ ఎంత టఫ్‌గా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి.
- 'సేవ్ ది క్యాట్', అకిరా కురసోవా రూపొందించిన 'రాషోమన్', అడివి శేష్ 'ఎవరు' సినిమా కూడా ఇదే స్ట్రక్చర్ స్క్రీన్ ప్లేతో ఉంటుంది. ఎస్ఐ రూప క్యారెక్టర్‌ని స్పందన పల్లి చాలా బాగా చేసింది. మ్యూజిక్ డైరెక్టర్, ఎడిటర్ ..ఇలా టెక్నీషియన్స్ బాగా సపోర్ట్ చేశారు. సినిమా నిడివి 1 గంట 39 నిమిషాలు మాత్రమే ఉంటుంది. దాంతో సినిమా స్క్రీన్ ప్లే పరుగులు పెట్టినట్లే క్రిస్ప్‌గా ఉంటుంది. ఇందులో ఒక మెసేజ్ కూడా ఉంటుంది.
- బిజినెస్ కోసం వేసిన షోస్ చూసిన వాళ్లు సినిమా బాగుందని మంచి ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. పీవీఆర్ ద్వారా రిలీజ్ చేస్తున్నాం. ప్రస్తుతం వర్గో పిక్చర్స్, జీ5 వాళ్ల ప్రాజెక్ట్ చేస్తున్నాను.

సరికొత్త కథ



హీరో అశ్విన్ బాబు కొత్త సినిమా ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.1గా మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్న చిత్రమిది. అప్సర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నిర్మాతలు సుధాకర్ రెడ్డి, 'ఠాగూర్' మధు, శిరీష్ రెడ్డి, ఎర్రబెల్లి విజయ్ కుమార్ రావు జ్యోతి ప్రజ్వలన చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి 'సోలో బ్రతుకే సో బెటర్' దర్శకుడు సుబ్బు మంగాదేవి కెమెరా స్విచ్చాన్ చేయగా, 'నాంది' దర్శకుడు విజయ్ కనకమేడల క్లాప్ ఇచ్చారు. 'బింబిసార' దర్శకుడు వశిష్ట తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. దర్శక, నిర్మాత ఓంకార్ స్క్రిప్ట్ అందజేశారు. నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, 'అశ్విన్ బాబుతో సినిమా చేయడం సంతోషంగా ఉంది. 'హిడింబ' వంటి మంచి విజయం అందుకున్న ఆయన మరో వైవిధ్యమైన కథతో మా సంస్థలో సినిమా చేస్తున్నారు. కొత్త కథ, కథనాలతో రూపొందుతున్న న్యూ ఏజ్ సినిమా ఇది. సోమవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తున్నాం. తొలి షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతుంది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని అన్నారు.

అశ్విన్ బాబు సరసన దిగంగనా సూర్యవంశీ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో 'హైపర్' ఆది ప్రధాన పాత్రలో నటించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్ : ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్ : సాహి సురేష్, మ్యూజిక్ డైరెక్టర్ : వికాస్ బడిస, డీవోపీ : దాశరథి శివేంద్ర.

ఆద్యంతం నవ్విస్తుంది



రవి పొలిశెట్టి, మహేంద్ర

ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం-1గా రూపొందిన చిత్రం 'సౌండ్ పార్టీ'. వీజే సన్నీ, ప్రితిక శ్రీనివాస్ జంటగా నటించారు. జయ శంకర్ సమర్పణలో సంజయ్ శేరి దర్శకత్వం వహించారు. రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలు. ఈనెల 24న ఈ సినిమా విడుదలవుతోంది.

ఈ సందర్భంగా నిర్మాతలు రవి పొలిశెట్టి, మహేంద్ర మీడియాతో మాట్లాడుతూ, 'మేం తెలంగాణలో పుట్టి, పెరిగాం. అమెరికాలో బిజినెస్ చేస్తూ ఫ్రెండ్స్ అయ్యాం. సినిమాలపై ఉన్న ప్యాషన్‌తో ప్రొడ్యూసర్స్‌గా మారాం. దర్శకుడు సంజయ్ శేరి చెప్పిన స్టోరీలో ఇన్నోసెంట్ కామెడీ ఉంది. పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో 28 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాం. అవుట్ పుట్ చాలా బాగా వచ్చింది. ప్రెజెంటర్‌గా ఉన్న జయశంకర్ మాకు చాలా సపోర్ట్ చేశారు. కంప్లీట్ ఫ్యామిలీ అంతా చూసేలా సినిమా ఉంటుంది. సినిమాలో కామెడీ ఉంటే అమెరికా ప్రేక్షకులు బ్లాక్ బస్టర్ చేస్తారు. ఇక్కడ 100 థియేటర్లో విడుదల చేస్తుంటే యూఎస్‌లో మాత్రం 150 ప్లస్ థియేటర్స్‌లో విడుదల చేస్తున్నాం. తండ్రీ కొడుకులు ఇద్దరూ ఇన్నోసెంట్ అయితే మనీ మేకింగ్ ఎలా చేస్తారు అనేది ఈ సినిమా కాన్సెప్ట్. ఫాస్ట్‌గా రిచ్ అయిపోవడానికి వాళ్లిద్దరూ ఏం చేశారనేది హిలేరియస్‌గా ఉంటుంది. బిట్ కాయిన్ కాన్సెప్ట్‌తోనూ ఫన్ జనరేట్ చేశాం. సన్నీ, శివన్నారాయణ మధ్య వచ్చే సీన్స్ ప్రేక్షకులకు నవ్వులు తెప్పిస్తాయి. కంప్లీట్ క్లీన్ కామెడీతో రాబోతున్న మా చిత్రాన్ని ప్రేక్షకులు కూడా ఆదరిస్తారని నమ్మకం ఉంది' అని తెలిపారు.

2 గంటల సింగిల్ షాట్ చిత్రం

రాజా కృష్ణ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రూపొందు తున్న చిత్రం 'ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు'. రెండు గంటల సింగిల్ షాట్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో హీరోగా యాక్ట్ చేస్తూనే సూపర్‌రాజా దీనికి రైటర్‌గా, డైరెక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ సినిమా విడుదల కానుంది. లేటెస్ట్‌గా సోమవారం ప్రసాద్‌లాబ్స్‌లో 8 నిమిషాల టైటిల్ లాంచ్ వీడియోని రిలీజ్ చేశారు. 'ఈ టైటిల్ లాంచ్ వీడియోలో గ్రాఫిక్స్, విజువల్స్, కాన్సెప్ట్, పెర్ఫార్మన్స్, మ్యూజిక్, దర్శకత్వం, నటన వీక్షకుల రోమాలు నిక్కపొడుచుకునేలా చేశాయి. సినిమా కూడా ఇంతకు మించి ఉంటుంది. ఇందులోని ప్రతి ఒక్క అంశం ఎప్పుడూ చూడని విధంగా ఉంటుందని గర్వంగా చెప్పగలను. ఈ రెండు గంటల సింగిల్ షాట్ సినిమాలో ఒక సాంగ్ కూడా ఉంది. డైలాగ్‌లు చెప్తూ, సాంగ్‌ని గుర్తు పెట్టుకుని ఒక్క ఎక్స్‌ప్రెషన్ మిస్ అవ్వకుండా స్టోరీ కొనసాగిం చడం ఎంత కష్టమో ఊహించడానికే వీలు కాదు. ఆ కష్టం, కసి, ఓర్పు మీరు సినిమాలోనూ చూడచ్చు' అని సూపర్ రాజా చెప్పారు. నటి రమ్య ప్రియ మాట్లాడుతూ, 'ఇది నా మొదటి సినిమా. ఇలాంటి మంచి సినిమాలో యాక్ట్ చేయటం చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు. ముఖ్య పాత్రధారి వంశి గొనె మాట్లాడుతూ,'ఈ సినిమా ఒక పెద్ద ఛాలెంజ్. నేను, సూపర్‌రాజా పడిన కష్టం, మా నటన మిమ్మల్ని అలరిస్తుందని' అని చెప్పారు.



రమ్య ప్రియ, సూపర్‌రాజా

మధ్య తరగతి ఫ్యామిలీ ఘర్షణలు

సాయిజా క్రియేషన్స్ పతాకం పై చల్లపల్లి చలపతిరావు ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మాతలుగా పద్మారావు అబ్బిశెట్టి (అలియాస్ పండు) దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'సారంగదరియా'. రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్ర టైటిల్ పోస్టర్‌ని హీరో రాజ్ తరుణ్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'పోస్టర్, టైటిల్ చూడగానే చాలా పాజిటివ్‌గా బాగుందనిపించింది. మంచి ఫ్యామిలీ చిత్రంగా 'సారంగ దరియా' సక్సెస్ అవ్వాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు. నిర్మాత శరత్ చంద్ర మాట్లాడుతూ, 'మా ఫస్టలుక్ టైటిల్ పోస్టర్‌ని విడుదల చేసిన హీరో రాజ్ తరుణ్‌కి చాలా థ్యాంక్స్ త్వరలో మూవీ విడుదలకి సన్నాహాలు చేస్తున్నాం. ఈ సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది' అని అన్నారు.



శరత్ చంద్ర, రాజ్‌తరుణ్, పద్మారావు

డైరెక్టర్ పద్మారావు అబ్బిశెట్టి (పండు) మాట్లాడుతూ,' సినిమా ఇంత బాగా రావడానికి సపోర్ట్ చేసిన రాజా రవీంద్రకి ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఒక మధ్యతరగతి ఫ్యామిలీలో జరిగిన కొన్ని ఘర్షణలతో ఈ సినిమా ఉంటుంది' అని తెలిపారు. శ్రీకాంత్ అయ్యంగార్, కాదంబరి కిరణ్, హర్షవర్ధన్ నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - అరుణాచల మహేష్ డైలాగ్స్-వినయ్ కొట్టి, ఎడిటర్ - రాకేష్ రెడ్డి, సంగీతం - ఎం.ఎబెనెజర్ పాల్, సినిమాటోగ్రఫీ - సిద్దార్థ స్వయంభు, లిరిక్ రైటర్స్ - రాంబాబు గోశాల కడలి సత్యనారాయణ.

మీ సామర్థ్యాలను నమ్మండి



డాక్టర్ సత్య రమణి వడ్లమాని... పురుషులు ఆధిపత్యం వహించే రంగంలో దృఢంగా నిలబడ్డారు. మురళీ కృష్ణ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ చైర్ పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో గొప్ప పారిశ్రామికవేత్తగా నిరూపించుకున్నారు. ఫార్మాస్యూటికల్ ప్రపంచంలో మార్పు తీసుకురావాలనే బలమైన దృక్పథంతో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. ఇన్నోవేషన్ పట్ల మక్కువతో అనేక సవాళ్లను అధిగమించి పరిశ్రమలో ప్రముఖ వ్యక్తిగా స్థిరపడ్డారు. పని చేస్తున్న రంగంలో ఆమెకున్న లోతైన అవగాహన కంపెనీ వృద్ధి, విజయంలో కీలక పాత్ర పోషించింది. దేశవ్యాప్తంగా ఫెయినా గాలించిన అత్యంత శక్తివంతమైన మహిళలు 40 మందిలో చోటు దక్కించుకున్నారు.

ఒక మహిళా సాధించాలనుకుంటే సామాజిక అడ్డంకులు ఆమెను అడ్డుకోవు. దృఢ సంకల్పం, దృఢత్వం, ఆత్మవిశ్వాసంతో మహిళలు ఎలాంటి అడ్డంకినైనా అధిగమించగలరని డాక్టర్ సత్య రమణి బలమైన అభిప్రాయం. ఇలాంటి మహిళలు చాలా మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తారు. 2023లో ఆమె నాయకత్వంలో కంపెనీ సాధించిన విజయాలు, ముఖ్యమైన మైలురాళ్లను ఎదుర్కొంటూ ముమ్ముందుకు సాగిపోతున్న మహిళలకు ఆమె ఓ చక్కటి ఉదాహరణ. సంస్థ నిర్వహిస్తున్న సంచలనాత్మక పరిశోధన ప్రపంచవ్యాప్తంగా క్లిష్టమైన ఆరోగ్య సంరక్షణ సవాళ్లను పరిష్కరించే వినూత్న ఔషధ ఉత్పత్తుల అభివృద్ధికి దారితీసింది. వ్యూహాత్మక భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం ద్వారా, మురళీ కృష్ణ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో అగ్రగామిగా తన స్థానాన్ని పదిలపరుచుకుంది.

ప్రోత్సహించే వాతావరణం అవసరం

డాక్టర్ సత్య వంటి వారి నుండి నేర్చుకోవాలని కోరుకునే అనేక మంది మహిళలకు ఆమె ఇచ్చే సలహా సులభమైనది అయినప్పటికీ అత్యంత శక్తివంతమైనది. 'మీపై నమ్మకాన్ని ఎప్పటికీ వదులుకోవద్దు, నిత్యం నేర్చుకుంటూ ఉండండి, మీ సామర్థ్యాలను నమ్మండి' అంటారు ఆమె. సాధికారత, వ్యాపార రంగంలో మహిళల చేరికను ప్రోత్సహించే సహాయక, సహకార పని వాతావరణాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెబుతున్నారు. ఔషధ పరిశ్రమపై డాక్టర్ సత్య బలమైన నాయకత్వ ప్రభావం శక్తివంతమైనది. అంకితభావం, నూతన ఆవిష్కరణలు, రాజీ పడని వ్యక్తిత్వంతో మహిళలు అద్భుతమైన విజయాలు సాధించవచ్చని ఆమె అంటున్నారు. అందుకే డాక్టర్ సత్య మహిళలకు సాధికారతకు, పరివర్తనకు రోల్ మోడల్‌గా నిలిచారు.



చుట్టూ మనుషులున్నా కొందరిని ఒంటరితనం వేధిస్తుంటుంది. దాన్ని అధిగమించేందుకు కొందరు సామాజిక మాధ్యమాలను ఆశ్రయిస్తుంటారు. అయినా ఏకాకిగా ఉన్నామనే భావన వారిని వెంటాడుతూనే ఉంటుంది. అమ్మాయిల్లో అయితే ఈ ధోరణి మరింత అధికంగా ఉంటుంది. ఇంతకీ ఆన్‌లైన్ బంధాలు మనల్ని ఒంటరితనం నుంచి బయటపడేస్తున్నాయా లేక మనల్ని మరింత ఏకాకిని చేస్తున్నాయా? కొన్ని సర్వేలు ఏం చెబుతున్నాయో తెలుసుకుందాం....

సోషల్ మీడియా ఎందుకు వాడుతున్నారు..?



ఒంటరి తనం నుండి బయట పడేందుకు అమ్మాయిలు సోషల్ మీడియా పై ఆధారపడుతున్నారా అనే దానిపై భిన్నరకాల అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల జరిగిన ఓ సర్వేలో ఏడు నుంచి పదేండ్లలోపు ఉన్న పిల్లల్లో 15 శాతం మంది ఆన్‌లైన్‌లో ఉన్నా ఒంటరిగానే ఉన్నట్లు భావిస్తున్నామని చెప్పారు. 11 నుంచి 16 ఏండ్లలోపు ఉన్న వారూ ఇదే చెబుతున్నారు.

స్నేహితులతో వున్నా...

18 ఏండ్ల కేట్ రోబెర్ట్స్... గర్ల్‌గైడింగ్ వెల్లడించిన సర్వే అంశాలపై స్పందిస్తూ "మహిళలు, అమ్మాయిల్లో ఒంటరితనం తీవ్ర సమస్యగా ఉందన్న విషయాన్ని ఈ సర్వే చెబుతోంది. నిత్యం స్నేహితులతో ఉండే అమ్మాయిలు కూడా ఒంటరిగానే ఉన్నట్లు ఫీలవుతున్నారు. తమ స్నేహితులు బయటకు వెళ్లిన ఫొటోలను సోషల్ మీడియాలో చూసి తాము వారితో వెళ్లలేదనే భావనతో ఒంటరితనం ఆవహించినట్లు భావించేవారు కూడా ఉన్నారు. ఇలాంటి కారణాల వల్ల అమ్మాయిలు తాము ఏకాకులం అని మథనపడే స్థితికి చేరుకుంటున్నారు" అని చెప్పారు.

ఒంటరివాళ్లమనే భావనతో...

ప్రతి ముగ్గురిలో ఒకరు కొన్నిసార్లు ఏకాకిగా ఉన్నట్లు ఫీలయ్యామని చెప్పారు. ముఖ్యంగా అబ్బాయిల కంటే అమ్మాయిలే తాము ఎక్కువగా ఒంటరివాళ్లమనే భావనలో ఉన్నారు. కొంతమంది తమ ఒంటరితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు సోషల్ మీడియాను వాడుతున్నట్లు చెప్పారు. చిన్నపిల్లలు కూడా ఒంటరితనంతో బాధపడుతున్నట్లు చైల్డ్‌లైన్ సంస్థ ఒక నివేదికలో తెలిపింది. ఒంటరితనాన్ని దూరం చేసుకునేందుకు వారు సహాయం కోరుతున్నారని పేర్కొంది.

ఒంటరితనానికి కారణం ఏంటి?

యువత ఒంటరిగా ఉన్నామనే భావనలో ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయి. యువతి అయినా యువకుడైనా ఈ సమస్యతో బాధపడుతున్నారంటే దానికి ఆన్‌లైన్‌కు వెళ్లడం ఒక్కటే కారణం కాదని గర్ల్‌గైడింగ్ తన సర్వే వివరాల ఆధారంగా పేర్కొంది. ఒంటరిగా ఉన్నట్లు అనిపించడానికి అనేక కారణాలున్నాయని అమ్మాయిలు చెబుతున్నారు. మాట్లాడటానికి ఎవరూ లేకపోవడం, తమ భావాలను ఎవరూ అర్థంచేసుకోకపోవడం, స్నేహితులు దొరకడం కష్టంగా మారడం, బయటకు వెళితే ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఇంట్లోనే ఉండటం

ఒంటరితనాన్ని అధిగమించేదెలా

ఇటీవల నిర్వహించిన సర్వేలో చాలా మంది మహిళలు ఒంటరితనాన్ని జయించడానికి ఆన్‌లైన్‌కి వెళ్లడం ఒక్కటే పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు.

ఇతర వ్యాపకాలతో...



7 నుంచి 10 ఏండ్ల మధ్యనున్న బాలికలను సర్వే చేసినప్పుడు స్నేహితులతో మాట్లాడటం ద్వారా ఒంటరితనం నుంచి బయటపడతామని చెప్పారు. ఇంట్లోవాళ్లతో మాట్లాడటం, పెంపుడు జంతువులతో ఆడుకోవడం, ఆటలు, చిత్రలేఖనంలాంటి వ్యాపకాలతో తాము ఏకాకిగా ఉన్నామనే భావనను తొలగించుకుంటామని చాలా మంది అమ్మాయిలు చెప్పారు.

ఆన్లైన్ స్నేహాల వల్ల

కొంతమంది సామాజిక మాధ్యమాలు మమ్మల్ని ఒంటరితనం నుంచి బయటపడేస్తున్నాయని అంటుంటే మరికొందరు మాత్రం ఆన్‌లైన్ స్నేహాలు మమ్మల్ని మరింత ఒంటరిని చేస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి పలు సర్వేలు యువత.. అందులోనూ ముఖ్యంగా అమ్మాయిలు ఒంటరితనంతో బాధపడుతున్నట్లు వెల్లడిస్తున్నాయి. ఇంగ్లాండ్‌కు చెందిన నేషనల్ స్టాటిస్టిక్స్ సంస్థ గతంలో వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆ దేశంలో ప్రతి పది మందిలో ఒకరు (10 నుంచి 24 ఏండ్ల మధ్యనున్న అమ్మాయిలు) ఒంటరితనంతో బాధపడుతున్నట్లు తెలిపింది.



ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

బోట్లను చేపలరేవులోని జెట్టీల వద్ద నిలిపి ఉంచారు. ఆదివారం అర్ధరాత్రి మొదటి బోటుకు నిప్పు అంటుకుని పక్క పక్కనే ఉన్న బోట్లకు అగ్నికీలలు వేగంగా వ్యాపించాయి. ప్రమాదం జరిగిన సమయంలో గాలులు అధికంగా వీయటం, వేలాది లీటర్ల డీజిల్ బోట్లలో ఉండటంతో ప్రమాదం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఈ ఆకస్మిక ఘటనతో మత్స్యకారులు హడలిపోయారు. హుటాహుటిన తరలివచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేక పోయింది. అగ్నిమాపక అధికారులు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పడం ప్రారంభించారు. అగ్నిమాపక అధికారులు, నేవీ సిబ్బంది ఐఎన్ఎస్ సహారా షిప్ ద్వారా మంటలు ఆర్పడం, త్వరితగతిన సహాయక చర్యలు చేపట్టడంతో ఉదయం 6 గంటలకు మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ప్రమాదంలో మొత్తం రూ.15 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగిందని, ఒక్కో బోటు ఖరీదు రూ.40లక్షల నుంచి రూ.80లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఘటన స్థలాన్ని ఆ రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు సోమవారం పరిశీలించారు. ఘటనకు గల కారణాల దర్యాప్తు వేగవంతం చేశామని, అనుమానితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన మత్స్యకారులను వైసీపీ, సీపీఐ(ఎం), సీపీఐ, టీడీపీ, జనసేన, ఆప్ పార్టీల నాయకులు పరామర్శించారు.

స్కిల్ కేసులో చంద్రబాబుకు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

29 నుంచి రాజకీయ సభలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని హైకోర్టు పేర్కొంది. అయితే ఈ నెల 30న చంద్రబాబు విజయవాడలో ఏసీబీ కోర్టులో హాజరు కావాలని ఆదేశించింది. తన చికిత్సకు సంబంధించిన నివేదికను ఏసీబీ కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది.

59,779 బ్యాలెట్ యూనిట్లు

(మొదటిపేజీ తరువాయి)

లెక్కతేల్చింది. ఆ తర్వాతి స్థానంలో ఓటర్లు ఎక్కువగా ఉన్న మేడ్చల్ నియోజకవర్గంలో 22 మంది పోటీచేస్తుండగా, 1,168 బీయూలు అవసరమవుతున్నాయి. పోలింగ్ స్టేషన్లు, పోటీలో ఉన్న అభ్యర్థులు, అవసరమైన ఈవీఎమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు సహా అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. 119 నియోజకవర్గాలు, 33 జిల్లాల్లో మొత్తం 116 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం ఈవీఎమ్‌లు భద్రపరిచేందుకు అవసరమైన స్ట్రాంగ్ రూంలనూ ఎన్నికల సంఘం అధికారులు పరిశీలించారు. ఈసారి ఎన్నికల్లో 135 పోలింగ్ కేంద్రాల లోకేషన్స్ మారాయి. 299 అదనపు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 762 పోలింగ్ కేంద్రాల పేర్లు మారాయి. ఇంటింటికీ ఓటర్ స్లిప్పుల పంపిణీ 51 శాతం పూర్తయినట్టు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 3 కోట్ల 26 లక్షల 2 వేల 799 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 1 కోటి 65 లక్షల 32 వేల 040 మంది ఓటర్లకు (51 శాతం) పోల్ స్లిప్‌లు అందచేశారు. మిగిలిన స్లిప్పుల్ని ఈనెల 23వ తేదీలోపు అందచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు హైదరాబాద్ చంచల్‌గూడలోని ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లో బ్యాలట్ పేపర్ల ముద్రణ ప్రారంభమైంది. మొదటిగా పోస్టల్ బ్యాలెట్లను ముద్రించారు.

ఆడిటోరియం స్లాబ్ కూలి ఇద్దరు కూలీలు మృతి

(మొదటిపేజీ తరువాయి)

మృతిచెందారు. పోలీసులు, రెస్క్యూ టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. మరో పది మంది కూలీలను కూడా బయటకు తీసి ఆస్పత్రులకు తరలించారు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రంగా తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యమంటే పట్వారీల రాజ్యమా...?

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడికి వచ్చినప్పుడల్లా ఏదో ఒక స్కీము ప్రకటిస్తానని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రో, డీజిల్ ధరలు పెంచుతూ.. ఆటో కార్మికులను పన్నుల పేరుతో నడ్డివిరుస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఆటోకార్మికుల పన్నులను రద్దు చేశామని, ఇప్పుడు కూడా వారు ఏడాదికి కడుతున్న ఫిట్‌నెస్ చార్జీలనూ రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. మానకొండూర్ నియోజకవర్గంలో ప్రతి ఎస్సీ కుటుంబానికీ దళితబంధు ఇస్తామని హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ రాజ్యంలో అన్నమే లేదని, తినేందుకు సరిగా తిండిలేక, పశువులకూ గడ్డి లేక తెగనమ్ముకున్నామని వివరించారు. రైతుబంధును పుట్టించిందే కేసీఆర్ అని, రైతు ఎక్కడా అప్పు చేయకుండా పంట పెట్టుబడి ఇస్తున్నదీ తామేనన్నారు. ప్రగతి వైపు నిలుస్తారా? లేదంటే మునుపటి దౌర్భాగ్య రోజులు తేస్తామంటున్న కాంగ్రెస్ వైపు ఉంటారా? అన్నది ఆలోచించుకోవాలన్నారు.

ఇందిరమ్మ రాజ్యమంటే కరెంట్ లేకపోవడమా?

కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెబుతున్నారని, ఇందిరమ్మ రాజ్యమంటే ఎమర్జెన్సీ, ఎన్‌కౌంటర్లు జరగడం, మంచినీరు, కరెంటు లేకపోవడమేనా ? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం సక్కగుంటే ఎన్టీఆర్ ఎందుకు పార్టీ పెట్టిండన్నారు. రూ.2లకే కిలో బియ్యం ఎందుకిచ్చిండ్రు ? అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చి పేదల కడుపులు నింపారని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి చెందిన ఒగ్గు కళాకారుడు చుక్కా సత్తయ్య 58 బోర్లు వేసినా ఇక్కడ చుక్క నీళ్లు పడలేదన్నారు. 'కడియం'కు టిక్కెటిచ్చినమని, ఎమ్మెల్యే రాజయ్యను చిన్నచూపు చూడమని, మంచి పదవిలో వుంటారన్నారు.

'ఈ ఎన్నికల్లో మనం వేయబోయే ఓటే వచ్చే ఐదేండ్ల మన తలరాతను మారుస్తుంది. మాయమాటలు ఎవరు చెబుతున్నారు? ప్రగతి బాటను ఎవరు చూపుతున్నారో? విచక్షణతో ఆలోచించాలి. పదేండ్లలో ప్రగతిబాట వేసుకున్నాం.. మళ్లీ అధికారంలోకి రాగానే ఆటోలకు ఫిట్‌నెస్ చార్జీలు రద్దు చేస్తాం..' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

వెలుగులు నింపిందే ఇందిరమ్మ రాజ్యంలో..

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్‌కు అవకాశమిచ్చింది కూడా కాంగ్రెస్సే అన్నారు. సోనియమ్మ తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ నాంపల్లి దర్గా దగ్గరో.. బిర్లా టెంపుల్ మెట్ల కిందో బిచ్చమెత్తుకునే వారని విమర్శించారు. కాంగ్రెస్‌ను తిడితే ప్రజలిచ్చే తీర్పుతో కొట్టుకుపోతావని హెచ్చరించారు. అన్నారం బ్యారేజీ పగిలిపోయింది.. మేడిగడ్డ కుంగిపోయిందన్నారు. తెలంగాణలో రాజరికం... ఆరాచకం రాజ్యమేలుతోందన్నారు. మూడు వేల వైన్స్‌లు, 60 వేల బెల్ట్ షాపులు పెట్టి తెలంగాణను తాగుబోతులకు అడ్డాగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకొచ్చాక అభయ హస్తం పేరిట ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు.

నమ్మక ద్రోహి సునితమ్మ

కాంగ్రెస్ పార్టీ అనేక అవకాశాలిస్తే నమ్మక ద్రోహం చేసి పదవుల కోసం శత్రువు పంచన చేరిన సునితమ్మను అసెంబ్లీ గేటు దాటనీయొద్దని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఆమె గెలుపు కోసం ప్రచారం చేసిన తనపై రెండు కేసులయ్యాయని, అవి ఇప్పటికీ నడుస్తున్నాయని అన్నారు. నమ్మక ద్రోహం చేస్తే సొంతవాడైనా.. ఆడబిడ్డైనా బండకేసి కొట్టాల్సిందేనన్నారు. తాము వచ్చాక నర్సాపూర్ నియోజకవర్గంలోని గిరిజనుల అభివృద్ధి కోసం రూ.100 కోట్ల ప్యాకేజీ ఇస్తామన్నారు.

నర్సాపూర్ సభలో కాంగ్రెస్ అధికార ప్రతినిధులు అద్దంకి దయాకర్, అంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకులు చిలుముల సుహాసినీరెడ్డి, కనకారెడ్డి పాల్గొన్నారు.

'ఇక కేసీఆర్, కేటీఆర్‌కు సెలవే..'

ఈనెల 30న జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికల తరువాత కేసీఆర్, కేటీఆర్‌కు ఇక సెలవేనని రేవంత్‌రెడ్డి అన్నారు. పరకాల నియోజకవర్గ పట్టణ కేంద్రంలోని వెల్లంపల్లి రోడ్డు పరిసర ప్రాంతంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి సారథ్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. పరకాలను అగ్నిగుండంగా మార్చింది కేసీఆర్, చల్లా ధర్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పరకాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా నిధులు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. కొండా దంపతులు అంటే తనకు బలమన్నారు. పార్టీ పటిష్టతకు కృషి చేసిన ఇనుగాల వెంకటరాం రెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, దొమ్మాటి సాంబయ్యకు సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు.

అసెంబ్లీలో మాట్లాడగలిగే ధైర్యం సీపీఐ(ఎం)కే ఉంది : వెంకట్

(మొదటిపేజీ తరువాయి)

పనిచేసి మల్లు భట్టి విక్రమార్కను, లింగాల కమల్‌రాజును ఓడించాలని పిలుపునిచ్చారు. సీఐటీయు జాతీయ కోశాధికారి మందడపు సాయిబాబు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ ప్రచార సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ తుళ్లూరు రమేష్, సర్పంచ్ నోముల వెంకట నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆ పార్టీలన్నీ ఒక్క తాను ముక్కలే..

(మొదటిపేజీ తరువాయి)

గ్రామంలో మధిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాలడుగు భాస్కర్ విజయం కోరుతూ విజయ రాఘవన్ సోమవారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. మధిర నియోజకవర్గం నుంచి పాలడుగు భాస్కర్ విజయం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి తెలంగాణ శాసనసభకు సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు గెలుస్తారనే సమాచారం తనకు ఉందన్నారు.

టీఎస్ఆర్టీసీలో సమ్మెలపై నిషేధం


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)లో సమ్మెల్ని నిషేధిస్తూ రవాణా శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఏ వాణి ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజారవాణా ఎస్మా పరిధిలో ఉన్నందని పేర్కొన్నారు. సమ్మెలు నిషేధిస్తూ ప్రస్తుతం అమల్లో ఉన్న ఉత్తర్వుల గడువు నవంబర్ 30వ తేదీనాటికి ముగుస్తున్నందున డిసెంబర్ 1వ తేదీ నుంచి తదుపరి ఆరు నెలలు (2024 జూన్ 30 వరకు) ఈ నిషేధ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని తెలిపారు. ప్రజలకు నిరంతర రవాణా సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నందున ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు కూడా సమాచారాన్ని అందించారు. ఈ మేరకు ప్రభుత్వ గెజిట్ ప్రచురించాలని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ విభాగం కమిషనర్‌ను ఆదేశించారు.



రూ.1,760 కోట్ల విలువైన డ్రగ్స్, నగదు, మద్యం స్వాధీనం



న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన రూ.1,760 కోట్ల విలువైన ఉచితాలు, డ్రగ్స్, నగదు, మద్యం, విలువైన లోహాలు స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) వెల్లడించింది. దీనికి సంబంధించిన వివరాలు ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసింది. 2018లో ఈ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే ఇది ఏడు రెట్లు (రూ.239.15 కోట్లు) పెరిగినట్టు తెలిపింది.ఇప్పటికే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగ్గా... రాజస్థాన్, తెలంగాణలో నవంబర్ 25, నవంబర్ 30 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, కర్నాటక ఈ ఆరు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో రూ.1,400 కోట్ల విలువైన జప్తులు జరిగాయనీ, ఇది ఈ రాష్ట్రాలలో గత అసెంబ్లీ ఎన్నికలలో జరిగినదానికంటే 11 రెట్లు ఎక్కువని ఈసీ పేర్కొంది.ఈసారి ఎన్నికల వ్యయ పర్యవేక్షణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్) ద్వారా పర్యవేక్షణ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ సాంకేతికతను కూడా ఉపయోగించిందనీ, ఇది మెరుగైన సమన్వయం, గూఢచార-భాగస్వామ్యానికి కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను తీసుకువచ్చిందని ప్రకటనలో పేర్కొంది.నవంబర్ 30న పోలింగ్ జరగనున్న తెలంగాణలో అత్యధికంగా రూ.659.2 కోట్లు, ఆ తరువాత నవంబర్ 25న పోలింగ్ జరగనున్న రాజస్థాన్‌లో రూ.650.7 కోట్ల విలువైన నగదు, మద్యం ఇతరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. మధ్యప్రదేశ్ మొత్తం రూ.323.7 కోట్లు, ఛత్తీస్‌గఢ్‌లో రూ.76.9 కోట్లు, మిజోరంలో రూ.49.6 కోట్లు విలువైనవి స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొంది. పోల్ ప్యానెల్ వివిధ సేవలకు చెందిన 228 మంది అధికారులను వ్యయ పరిశీలకులుగా నియమించింది. నిశిత పర్యవేక్షణ కోసం 194 అసెంబ్లీ నియోజకవర్గాలు "వ్యయానికి సంబంధించిన" స్థానాలుగా గుర్తించింది.

ఎందుకు ఆపారు?

(మొదటిపేజీ తరువాయి)

చెప్పింది. అయితే, గవర్నర్ ఆమోదాన్ని నిలుపుదల చేస్తున్నట్టు చెప్పగలరా? అనేది తమ ప్రశ్న అని సీజేఐ అన్నారు.

వీలైనంత త్వరగా బిల్లును గవర్నర్ వాపసు చేయాల్సి ఉంటుందని, లేకుంటే అది రాజ్యాంగ నిబంధనలను అపహాస్యం చేయడమేనని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ అన్నారు. గవర్నర్‌కు 'పాకెట్ వీటో'ను ఊహించాలా? అతనికి పాకెట్ వీటో ఉందా?" అని ప్రశ్నించారు.

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవి అసెంబ్లీ ఆమోదం పొంది మూడేండ్లుగా గవర్నర్ ఆమోద ముద్ర కోసం పంపించిన బిల్లుల్ని వెనక్కి పంపారు. ప్రభుత్వం అసెంబ్లీని మళ్లీ శనివారం సమావేశపరిచి పది బిల్లుల్ని ఆమోదించింది. వాటిని ఆమోదం కోసం గవర్నర్‌కి పంపింది. కోర్టు ఈ పరిణామాలన్నీ గమనిస్తోంది. అసెంబ్లీ మళ్లీ బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపింది. గవర్నర్ ఏం చేస్తారో చూద్దాం అంటూ తదుపరి విచారణను డిసెంబరు 1కి వాయిదా వేసింది.

కేరళ గవర్నర్‌కు, కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనానికి సమర్పించారు. అసెంబ్లీ ఆమోదం తెలిపిన ఎనిమిది బిల్లులను గత 21 నెలలుగా గవర్నర్ ఆమోదించలేదని తెలిపారు. అంతేకాకుండా ఆ బిల్లుల్లో మూడు ఆర్డినెన్స్‌లు గవర్నర్ ప్రకటించినవని, అవి ఆ తరువాత శాసనసభ ఆమోదించిన బిల్లులుగా మార్చబడ్డాయని అన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం విచారణకు రావాలని అటార్నీ జనరల్ (ఏజీ) ఆర్. వెంకటరమణికి నోటీసులు జారీ చేసింది. లేదంటే సొలిసిటర్ జనరల్ (ఎస్జీ) తుషార్ మెహతానైనా రావాలంటూ విచారణను ఈనెల 24 నాటికి (శుక్రవారం) వాయిదా వేసింది.





వారి హయాంలోనే మిర్యాలగూడ అభివృద్ధి

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు, రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రధాన కేంద్ర బిందువుగా ఉన్న మిర్యాలగూడ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. సాగర్ ఎడమ కాలువ పరిధిలోని మొత్తం మొదటి జోన్ పరిధిలో ఉన్న మిర్యాలగూడ నియోజవర్గం వ్యవసాయానికి ప్రధాన ఆధారం. పండించిన పంటను కొనుగోలు చేసినందుకు అవసరమైన రైస్ ఇండస్ట్రీని స్థానికంగా ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ రైస్ ఇండస్ట్రీ ఆసియా ఖండంలోనే వ్యాపారపరంగా రెండో స్థానంలో ఉంది. కార్మికులు వ్యవసాయ కూలీలు, పేద ప్రజలు, చిన్నచిన్న వ్యాపారులు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గం కమ్యూనిస్టులకు కంచుకోటగా నిలిచింది. వారి హయాంలోనే అభివృద్ధి జరిగింది.

నవతెలంగాణ-మిర్యాలగూడ

ముందుగా మిర్యాలగూడ పెద్దమునగాల నియోజకవర్గంగా ఉండేది. పెద్దమనగాల నియోజకవర్గంలో 1952లోనే రెండు పర్యా యాలు ఎన్నికలు జరిగాయి. ఒకసారి పీడీఎఫ్ అభ్యర్థి, అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. 1951లో మిర్యాలగూడ నియోజకవర్గం ఏర్పడిన తరువాత నుంచి ఇప్పటి వరకు 15సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఏడు పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థులు, ఐదు పర్యాయాలు సీపీఐ(ఎం) అభ్యర్థులు గెలుపొందారు. ఒక పర్యాయం పీడీఎఫ్ అభ్యర్థి గెలుపొందారు. 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ (టీఆర్ఎస్) అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు గెలుపొందారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) తరపున జూలకంటి రంగారెడ్డి పోటీపడుతున్నారు. కాంగ్రెస్ నుంచి బీఎల్ఆర్ ఉన్నారు.

అనేక రకాలుగా కార్మికులకు అండగా సీపీఐ(ఎం)
సాగర్ నీటి కోసం నిరవధిక నిరాహార దీక్ష

ఎన్నో పనులకు రూపకల్పన చేసిన రంగన్న

45 ఏండ్లుగా ప్రజా జీవితంలో జూలకంటి

జూలకంటి రంగారెడ్డి 45 ఏండ్లుగా ప్రజాజీవితంలోనే కొనసాగుతున్నారు

కార్మికులకు అండగా..

నియోజకవర్గాన్ని గెలిచిన కమ్యూనిస్టు అభ్యర్థులు ఎంతో అభివృద్ధి చేశారు. ముఖ్యంగా రైస్ ఇండస్ట్రీలు ఎక్కువగా ఉండటం, అందులో కార్మికులు, సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు ఉండటంతో రైతులు, రైతు కూలీలు అధికంగా ఉన్నారు. ఈ రెండు వర్గాలకు కమ్యూనిస్టులు అండగా ఉండటం.. కష్టాల్లో పాలుపంచుకోవడంతో ఈ నియోజకవర్గం ఎర్రజెండాకు కంచుకోటగా ఉండేది. అరిబండి లక్ష్మీనారాయణ 1978, 1985, జూలకంటి రంగారెడ్డి 1994, 2004. 2009 ఎన్నికల్లో గెలుపొందారు. అరిబండి లక్ష్మీనారాయణ హయాంలో దాతల సహకారంతో మిర్యాలగూడలో కేఎన్ఎమ్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. నేరేడుచర్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయించారు. గోపాలపురం బ్రిడ్జి నిర్మించి ప్రజలందరికీ రాకపోకల సౌకర్యం కల్పించారు.

డీవైఎఫ్ఐ నుంచి మొదలైన రాజకీయ ప్రస్థానం.. సీపీఐ(ఎం)లో జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా, ఆయా ప్రజా సంఘాల బాధ్యతల్లో ఉన్నారు. అప్పట్లో ఆయన రాశి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కోసం ఉద్యమాలు చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద నిరవధిక దీక్ష చేసి యాజమాన్యం దిగొచ్చేలా చేశారు. సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల చేయాలని నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్ర చేశారు.

నీటి విడుదల కోసం ఆర్డీఓ కార్యాలయం ఎదుట పక్షం రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేశారు.

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని పాత వ్యవసాయ మార్కెట్ వద్ద నిరవధిక దీక్ష చేశారు. చివరి భూములకు నీళ్లు అందించాలని దామచర్ల మండలంలో అనేక లెఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు చేయించి పంట భూములను సస్య శ్యామలం చేశారు.

పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారణ కోసం బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి మినీ రవీంద్రభారతిని మంజూరు చేయించారు. క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం, ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు పందిళ్ల చెరువు వద్ద బోటింగ్ పార్కు ఏర్పాటు చేశారు. పట్టణ నడిబొడులో ఎన్ఎస్పీ క్యాంపులో సుందరయ్య పార్క్ ఏర్పాటు చేసి ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని అందించే విధంగా తీర్చిదిద్దారు.

50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశారు. నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉండేందుకు జిల్లాలోనే అతిపెద్ద గ్రంథాలయాన్ని నిర్మించారు. ఆ అభివృద్ధి పనులనే ప్రస్తుత ఎమ్మెల్యే తాను చేసినట్టు చెప్పుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పది సంవత్సరాలుగా ఏ పదవీ లేకున్నా ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ ముందుండి అండగా నిలుస్తున్నారు. అందుకే ఆయనను నియోజకవర్గ ప్రజలు ప్రేమగా 'రంగన్న' అని పిలుచుకుంటారు.



జెండాలు మార్చే వారిని ఓడించండి

సీపీఐ(ఎం) పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ- ఖమ్మం రూరల్

జెండాలు మార్చే నాయకులను ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంరూరల్ మండలంలోని చింతపల్లి, శ్రీరామ్ నగర్, కొండాపురం, సీతారాంపురం, అరేంపుల, బారుగూడెం, శ్రీ సిటీ, గొల్లగూడెం, నందనవనం, రుద్ర టౌన్షిప్ గ్రామాల్లో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. పాలేరులో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు బడా కాంట్రాక్టర్లని, డబ్బుల సంచులతో ప్రజలను ప్రలోభపెట్టి ఓట్లు కొనేందుకు వస్తున్నారని, అలాంటి వారికి తగురీతులో బుద్ధి చెప్పి నిజాయితీపరులకే పట్టం కట్టాలని కోరారు. 50 ఏండ్ల నుంచి పట్టిన జెండా వీడని చరిత్ర తనదన్నారు. ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం 2003లో 2600 కిలోమీటర్ల పాదయాత్ర చేశానని, గోదావరి జలాలను పాలేరులో కలిపి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు మహాప్రస్థానం పేరుతో పాదయాత్ర చేశానని గుర్తు చేశారు.



మార్కెట్ తరలింపును పోరాడి అడ్డుకున్నా..

సీపీఐ(ఎం) ఖమ్మం అభ్యర్థి యర్రా శ్రీకాంత్

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం గ్రేయిన్ మార్కెట్‌ను తరలించాలనే కుట్రలు చేసిన చరిత్ర బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులదని, మార్కెట్ తరలింపును అడ్డుకొని పోరాడిన సీపీఐ(ఎం)కు ఓటేయండని పార్టీ అభ్యర్థి యర్రా శ్రీకాంత్ అన్నారు. సీపీఐ(ఎం) విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక ఖమ్మం త్రీ టౌన్‌లోని గాంధీ చౌక్‌లో షాప్ టూ షాప్ తిరుగుతూ యర్రా శ్రీకాంత్ ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చౌక్ సెంటర్‌లో పార్టీ త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీను అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మంలో రెండు కార్పొరేట్ శక్తులు ఎన్నికలలో డబ్బుతో గెలవాలని చూస్తున్నారని, వారు ఎప్పుడైనా కార్మికులు, ప్రజా సమస్యలపై పోరాడారా అన్ని ప్రజలు ఆలోచించి ఓటేయాలన్నారు. నిత్యం కార్మికులు, ప్రజల కోసం పనిచేస్తున్న తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ అవినీతిని వెలికి తీస్తాం..

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పండి
- జనగామ బహిరంగ సభలో అమిత్ షా

నవతెలంగాణ-జనగామ

బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని.. దాన్ని వెలికి తీస్తామని కేంద్ర హోంమంత్రి, బీజేపీ నేత హమిత్‌షా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రిస్టియన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హమిత్‌సా ప్రసంగించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఓవైసీ జపం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎంఐఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను 2జీ, 3జీ, 4జీ పార్టీలుగా అభివర్ణించారు. ఓవైసీ మత్తులో పడి సెప్టెంబర్ 17న రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని కేసీఆర్ పూర్తిగా విస్మరించారన్నారు.

తాము అధికారంలోకి రాగానే జనగామ జిల్లాలో అవసరమైన పాలిటెక్నిక్ కాలేజ్‌తోపాటు బైరాంపల్లిలో వీరుల స్మారక స్మృతిని ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రజాకార్లను ఎదిరించి కొట్లాడిన వీర చరిత్ర ఈ ప్రాంతానికి ఉందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన పూర్తిగా అవినీతిమయమైందన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, హైదరాబాద్, మియాపూర్ భూములు, వివిధ ప్రాజెక్టులలో అవినీతి జరిగిందని ఆరోపించారు. వాటన్నింటినీ త్వరలో వెలికి తీసి అవినీతిపరులను జైలుకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జనగామ నియోజకవర్గ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి, స్టేషన్‌ఘన్పూర్ అభ్యర్థి గుండె విజయరామారావు, పాలకుర్తి నియోజకవర్గం అభ్యర్థి రామ్‌మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, నాయకులు విద్యాసాగర్ రెడ్డి, ఉడుగుల రమేష్, చౌడ రమేష్, అశోక్, కెవిఎల్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

పంచ్ తంత్రం!

విధిలోన ఉండుటే అధికారి పనిగాదు
మనము జెప్పిన మాట వినగవలెను
రూల్సు గీల్సూ అంటూ ఫాల్సుమాటలు చెప్తె
తుప్పలూ తంగెళ్లు తప్పవౌర
సిట్టంటె కూర్చొని స్టాండంటె నిలుచునే
అధికారులే మాకు అవసరమ్ము
కాని పనులు గూడ ఖచ్చితంబుగ జేసి
మెప్పించు వారలే మేలు మాకు

అట్టి వారినె గూర్చుండ బెట్టుతాము మంచితావుల
నన్నింటి నెంచి చూసి మాట విననోళ్ళ
ఓ మూల సీటుజూసి
ఉనికి లేనట్టి పోస్టులో వేతుమోయి

- ఏనుగు నరసింహారెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు

- కండ్లతో చూసిందే నమ్మండి.. జూటా మాటలు కాదు
- అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తాం
- రోడ్ షోలో మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-వర్గల్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరువుతో పాటు కరెంట్ కష్టాలు వస్తాయని ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్ డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములకు వచ్చే ప్రభుత్వంలో సర్వ హక్కులు కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదల భూములను గుంజుకుంటుందని ప్రతిపక్ష నాయకులు జూటా మాటలు చెబుతున్నారన్నారు. నీళ్లు, 24 గంటల కరెంటు, పేదల కోసం వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చింది సీఎం కేసీఆర్‌యేనని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే గ్రామాలలో కేసీఆర్ వేసిన రోడ్లకు గతుకులు వస్తే డాంబర్‌తో కూడా నింపరన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత భూములకు విలువ పెరిగిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రూ. 600 పెన్షన్ మాత్రమే ఇస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ 2వేల పెన్షన్ ఇస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 2వేల పెన్షన్ ఎక్కడైనా ఇస్తున్నారా ఈటల రాజేందర్ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ రాక ముందు గజ్వేల్ ప్రాంతం ఎలా ఉందో, కేసీఆర్ గజ్వేల్ వచ్చిన తర్వాత ఎలా ఉందో ప్రజలు గుండె మీద చేయి వేసుకొని ఒకసారి ఆలోచించాలన్నారు. ఎక్కడో ఉన్న గోదావరి జలాలను తీసుకొచ్చి కాళ్ళు కాడిగింది వాస్తవం కాదా అన్నారు. సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడవసారి సీఎంగా రికార్డు సృష్టించబోతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ బాలమల్లు యాదవ్, ఎంపీపీ లతరమేష్, ప్యాక్స్ చైర్మెన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

11 సార్లు అవకాశం ఇస్తే ఏం చేశారు

- కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అధోగతే..
- మోడీ ఆడబిడ్డలకు అన్యాయం చేసిండ్రు : రోడ్‌షోల్లో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ -మిర్యాలగూడ/ యాదగిరిగుట్ట

ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. ఒకే ఒక్కసారి అవకాశం ఇవ్వండని కాంగ్రెస్ నాయకులు వేడుకుంటు న్నారని.. కానీ ఇప్పటికి 11సార్లు ప్రజలు అవకాశం ఇచ్చినా ఏం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, భువనగిరి అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి, మిర్యాలగూడ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు గెలుపు కోరుతూ రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజలు కష్టాలు పడ్డారని చెప్పారు.

మళ్లీ ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, వెంకటరెడ్డి, జానారెడ్డి సన్నాసులు ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తెలంగాణ రాష్ట్రం అధోగతి పాలవుతుందని, ప్రజలంతా రాష్ట్ర పరిస్థితిని ఆలోచించి అభివృద్ధి చేసే బీఆర్ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని కోరారు. రాష్ట్రంలో 24గంటల కరెంట్ రావట్లేదని అంటున్న కాంగ్రెస్ నేతలు మిర్యాలగూడ మండలంలోని ఏదైనా గ్రామానికి వచ్చి కరెంట్ తీగలు పట్టుకొని.. వస్తుందో రాట్లేదో తెలుసుకోవాలని సూచించారు.

ఎద్దు, వ్యవసాయం తెలియనోడు రేవంత్‌రెడ్డి అని, క్లబ్‌లు, పబ్‌లు మాత్రమే ఆయనకు తెలుసని అన్నారు. రైతుల బాధలు తెలియనోడు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

2014లో యాదగిరిగుట్ట ఎలా ఉంది ఇప్పుడు ఎలా ఉందో చూస్తే సరిపోతుందని తెలిపారు. యాదగిరిగుట్ట కొండపైకి ఆటోలు వెళ్లే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ప్రధానమంత్రి మోడీ ఆడబిడ్డలకు అన్యాయం చేశారని, రూ.400 ఉన్న సిలిండర్‌ను రూ.1200 చేశారని విమర్శించారు. మళ్లీ కేసీఆర్ అధికారంలోకి రాగానే రూ.400కే సిలిండర్ ఇస్తామన్నారు.

ఫార్మాతో ప్రమాదకరం

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మొద్దు
సీపీఐ(ఎం) మాజీ ఎంపీ పి.మధు
ఇబ్రహీంపట్నం అభ్యర్థి యాదయ్య తరపున ప్రచారం



నవతెలంగాణ-యాచారం

ఫార్మా కంపెనీతో ఈ ప్రాంతంలో గ్రామాలు కనుమరుగయ్యే ప్రమాదముందని సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎంపీ పి.మధు అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య సోమవారం యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నంలో ప్రచారం నిర్వహించారు. యాచారం, మంచాల మండలాల్లో బైక్ ర్యాలీ తీశారు. యాచారం మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన సభల్లో పి.మధు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో చెలగాటమాడాయని తెలిపారు. పదేండ్లలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డి విరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి బీజేపీ అత్యంత ప్రమాదకరమని చెప్పారు. ఫార్మా పేరుతో రైతుల భూములను గుంజుకున్నారన్నారు. ఫార్మా పేరుతో బీఆర్ఎస్ నాయకులు కోట్ల రూపాయలు దండుకున్నారని, ఆ డబ్బుతోనే ప్రజల ఓట్లను కొనాలని చూస్తున్నారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కమ్యూనిస్టుల ఓట్లతో గెలిచి రియల్ ఎస్టేట్ పేరుతో కోట్ల రూపాయలు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. ఫార్మా కంపెనీతో ఈ ప్రాంత గ్రామాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మా బాధిత రైతులంతా ఎర్ర జెండాకు ఓట్లేసి అండగా నిలబడాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మొద్దని సూచించారు. ఈ ప్రాంతంలో భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా పోరాడి ఎంతోమంది పేద ప్రజలకు ఎర్రజెండా భూములను పంచిపెట్టిందని గుర్తు చేశారు. ప్రజలంతా ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు. నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడే ఎర్రజెండా అభ్యర్థి పగడాల యాదయ్యను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.భూపాల్, స్కైలాబ్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, నాయకులు బి.మధుసూదన్‌రెడ్డి, ఆలంపల్లి నరసింహ, పి.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి నిరసన సెగ

హామీల అమలు విఫలంపై ఫ్లెక్సీ

ఆర్మూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ఫ్లెక్సీ రూపంలో నిరసన సెగ తగిలింది. ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా గంగాసముద్ర గ్రామంలో పర్యటిం చగా.. ఫ్లెక్స్ రూపంలో గ్రామస్తులు నిరసన తెలియజేశారు. రైతులకు రుణమాఫీ ఎక్కడ? మా ఊరిలో దళితులు లేరా.. దళితబంధు ఎక్కడ? పేద కుటుంబాలకు ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రొసీడింగ్ యాడికి పోయాయ్, మన ఊరు మన బడి అంటివి ఎక్కడ, డ్రైనేజీ, సీసీ రోడ్లు ఎక్కడా?.. ప్రజలు ప్రశ్నించడం మొదలు పెడితే ఇష్టం వచ్చిన వాగ్దానాలు ఇక చేయరు" అని గంగాసముద్ర గ్రామస్తులు ఫ్లెక్సీ కట్టారు. ఎన్నికలు వస్తేనే మా గ్రామం మీకు గుర్తుకు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 'గో బ్యాక్' ఎమ్మెల్యే అంటూ నిరసన తెలియజేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

విస్తరిస్తున్న గాజా దాడులు

తాజాగా ఇండోనేషియా ఆస్పత్రిపై దాడి

- 12 మంది మృతి, నేలపై చెల్లాచెదురుగా మృతదేహాలు
- మరో స్కూలుపైనా దాడి
- అరబ్, ముస్లింలీగ్ మంత్రుల టూర్ జిన్‌పింగ్, మాక్రాన్ ఫోన్‌కాల్
- హూతీ రెబెల్స్ అదుపులో ఇజ్రాయిల్ నౌక : చెరలో 25 మంది



గాజా : గాజాలో ఇజ్రాయిల్ దాడులు మరింత విస్తృతమవుతున్నాయి. తాజాగా ఇజ్రాయిల్ బలగాల భీకర దాడులకు మరో ఆస్పత్రి బలైంది. గాజాలోని ఇండోనేషియా ఆస్పత్రిపై దాడి జరిగింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ దాడుల్లో 12మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఆస్పత్రి లోపల ఆశ్రయం పొందినవారు ఆస్పత్రి వదిలి వెళ్లిపోవడానికి ప్రయత్నించగా వారిపై బలగాలు కాల్పులు జరిపాయని, మృతదేహాలన్నీ ఎక్కడికక్కడ నేలపై చెల్లాచెదురుగా పడి వున్నాయని, మృతదేహాలను ఖననం చేసే పరిస్థితి కూడా లేదని ఆ వర్గాలు తెలిపాయి. ఆస్పత్రి చుట్టూ ఇజ్రాయిల్ ట్యాంక్‌లు చుట్టుముట్టాయి. ఆస్పత్రిలో దృశ్యాలు బీభత్సంగా వున్నాయి. కాగా ఐసియుల్లోని నవజాత శిశువులను వైద్యం కోసం ఈజిప్ట్‌కు తరలించారు. ఇప్పటివరకు అల్‌షిఫా ఆస్పత్రి నుండి నెలలు నిండకుండా పుట్టిన 31మంది శిశువులను తరలించినట్లు డబ్ల్యుహెచ్‌ఓ తెలిపింది.

మరోవైపు అల్ కువైట్ యుఎన్ స్కూలును కూడా తగలబెట్టేశారు. గాజా ప్రజలు కూడా అక్కడ ఆశ్రయం పొందుతున్నారు. అయితే అక్కడ మృతుల సంఖ్య ఎంతనేది ఇంకా తెలియరాలేదు. ఈ దాడిని ఇండోనేషియా విదేశాంగ మంత్రి రెటినో మార్సుది ఖండించారు. అంతర్జాతీయ మానవతా చట్టాలను ఇది తీవ్రంగా ఉల్లంఘించడమేనన్నారు. అన్ని దేశాలు ముఖ్యంగా ఇజ్రాయిల్‌తో సన్నిహిత సంబంధాలు కలిగిన దేశాలన్నీ తన పలుకుబడిని, సామర్ధ్యాలను ఉపయోగించి ఈ దారుణాలను ఆపేలా చూడాలని రెటినో కోరారు. మరోవైపు అదనపు ప్రాంతాలకు తమ ఆపరేషన్‌ను విస్తరిస్తున్నామని ఇజ్రాయిల్ సైన్యం హెచ్చరించింది. జాబాలియా శరణార్ధ శిబిరానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అక్కడ నుండి ఖాళీ చేయాలని ఆదేశించింది. ఇదిలావుండగా, ఎర్ర సముద్రంలో ఇజ్రాయిల్‌కు చెందిన సరుకుల రవాణా నౌకను యెమెన్‌లోని హూతీ రెబెల్స్ స్వాధీనం చేసుకున్నారు. అందులోని 25మంది సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారని అధికారులు తెలిపారు. దీంతో ఘర్షణలు ఇతర ప్రాంతాలకూ వ్యాపిస్తాయనే ఆందోళన ముదురుతోంది.

అరబ్, ముస్లిం మంత్రుల టూర్

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని అరబ్, ముస్లిం మంత్రులు సోమవారం పిలుపిచ్చారు. గాజాలో ఘర్షణలను నివారించేందుకు జరుపుతున్న పర్యటనలో భాగంగా సోమవారం వారు బీజింగ్‌లో పర్యటించారు. గాజాలో మానవతా సంక్షోభం తలెత్తకుండా ప్రపంచ దేశాలు అత్యవసరంగా చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి పేర్కొన్నారు. గాజాలో యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా ముగించేందుకు గల అవకాశాలపై మంగళవారం మాస్కోలో అరబ్ లీగ్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (ఓఐసి) విదేశాంగ మంత్రులు సమావేశం కానున్నారు.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ సోమవారం గాజాలో పరిస్థితులపై ఫోన్‌లో చర్చించారు. మరింత తీవ్రమైన మానవతా సంక్షోభం పెచ్చరిల్లకుండా నివారించడానికి చర్యలు తీసుకోవడానికి ఇరువురు నేతలు అంగీకరించారు. అల్‌షిఫా ఆస్పత్రిలోనే హమస్ బందీలను దాచిందని ఆరోపిస్తూ ఇజ్రాయల్ రక్షణ బలగాలు సోమవారం ఒక వీడియోను విడుదల చేశాయి. అయితే హమస్ వాటిని ఖండించింది. కాగా, హమస్ చెరలోని 240మంది బందీల ను విడిపించేందుకు ఒప్పందం కుదిరే దిశగా పురోగతి సాధిస్తున్నట్లు కతార్ మధ్యవర్తులు తెలిపారు.

నవంబరు 20ని ప్రపంచ బాలల దినోత్సవంగా పాటిస్తారు. బాలల హక్కులు, భద్రత, విద్య , ఆరోగ్యం, సంతోషం కోసం అంతర్జాతీయంగా నిర్వహించే ఈ రోజున గాజాలో పరిస్థితి దారుణంగా వుంది. ఇప్పటివరకు 5500మంది చిన్నారులు దాడులకు బలయ్యారు. ప్రతి పది నిముషాలకు ఒక్కో చిన్నారి కన్నుమూశాడు.

నలుగురు జర్నలిస్టులు, ముగ్గురు మీడియా సిబ్బంది మృతి

ఇజ్రాయిల్ దాడుల్లో గడిచిన 24గంటల్లో నలుగురు జర్నలిస్టులు, ముగ్గురు స్థానిక మీడియా సిబ్బంది మరణించారు. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో దాదాపుగా 40మంది జర్నలిస్టులు మరణించారు. సెంట్రల్ గాజా లోని అల్ బురీజ్ శరణార్ధి శిబిరంపై జరిగిన బాంబుదాడిలో అక్కడ ఆశ్రయం పొందుతున్న సారి మన్సూర్, హసౌ నెహ సలీంలు మృతి చెందారు. బిబిసికి చెందిన మరో ప్రముఖ పాత్రికేయుడు, పాలస్తీనా రాజకీయ వ్యవహారాల విశ్లేషకు డు ముస్తఫా అల్ సవాఫ్ కూడా చనిపోయారు. ఆయన నివాసం లక్ష్యంగా ఇజ్రాయిల్ సైన్యం జరిపిన బాంబు దాడిలో ఆయన మరణించారు. స్థానిక ఫోటో జర్నలిస్ట్ ముసాబ్ అషౌర్, అల్ అక్సా రేడియోలో పని చేసే వ్యక్తి అబ్దుల్‌హమిద్ అవద్, అల్ అక్సా టెలివిజన్ ఛానెల్‌కి చెందిన అమర్ అబు హయ్యాలు కూడా ఈ దాడుల్లో కన్నుమూశారు. మృతుల్లో ప్రెస్ హౌస్ డైరెక్టర్ బిలాల్ జదల్లా కూడా ఉన్నారు. గాజా సిటీలోని ఆయన కారుపై బాంబులు వేసినట్లు హమాస్ కమ్యూనికేషన్స్ ఆఫీస్ తెలిపింది. గాజాపై ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ప్రపంచానికి తెలియజేస్తున్న జర్నలిస్టులు తమ వార్తా కవరేజీ సందర్భంగా పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపింది.

చుక్కా రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కారామయ్య 99వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరిశంకర్ సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 99 ఏండ్ల వయసులో కూడా చుక్కా రామయ్య పదునైన ఆలోచనలతో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. 'రాష్ట్రంలో ఎన్నికల తీరు ఎలా నడుస్తోంది? ప్రస్తుత రాజకీయ వాతావరణ విశేషాలేమిటి? ఏయే అంశాలపై ఎన్నికల ఎజెండాలు కొనసాగుతున్నాయి?' అనే విషయాలను చుక్కారామయ్య తనను అడిగి తెలుసుకున్నారు. 99 ఏండ్ల వయసులో కూడా ఆయన చురుకుగా ఆలోచించడం సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధతను, నిమగ్నతను తెలియజేస్తున్నదని పేర్కొన్నారు.

30న హైకోర్టుకు సాధారణ సెలవు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30న హైకోర్టుకు సాధారణ సెలవు ఉంటుందని హైకోర్టు రిజిస్ట్రీ ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల 16న హైకోర్టుకు పనిదినం ఉంటుందని తెలిపారు.

మాట తప్పిన సీఎం కేసీఆర్

- మాజీ మంత్రి పుష్పలీల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళిత సీఎం మాట ఇచ్చి తప్పిన సీఎం కేసీఆర్ ఆ వర్గాల ఓట్లు దండుకునేందుకు చూస్తున్నారని మాజీ మంత్రి పుష్పలీల విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. మాల, మాదిగల మధ్య చిన్న పంచాయితీని పరిష్కరించలేకపోయారనీ, దళితులను అవమానించారనీ, బీఆర్ఎస్ హయాంలో దళితులపై రోజు రోజుకు దాడులు పెరిగాయనీ, ఆ వర్గాల అభివృద్ధికి దూరమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడెకరాల భూమిని దళితులకు ఇవ్వలేదని తెలిపారు. టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మెన్ ప్రీతం మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో దళితులపై దాడులు, లాకప్ డెత్‌లు, ఆత్మహత్యలు పెరిగాయని విమర్శించారు. కేసీఆర్ దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు తిన్న వారిని వదిలేది లేదని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్లు పెంచుతాం

- కర్నాటక ఎమ్మెల్సీ బి.కె.హరిప్రసాద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేపట్టి బీసీల రిజర్వేషన్లను పెంచుతామని ఆ పార్టీ కర్నాటక ఎమ్మెల్సీ బి.కె.హరిప్రసాద్ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసి పని చేస్తున్నా... ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో బీసీలకు కేవలం 23 శాతం రిజర్వేషన్ మాత్రమే ఉన్నాయనీ, దాన్ని పెంచాల్సిన అవసరముందన్నారు. కర్నాటకలో 10 గంటల కరెంట్ ఇస్తున్నా....సీఎం కేసీఆర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. జేడీఎస్ నేత కుమారస్వామితో కాంగ్రెస్‌పై బీజేపీ, బీఆర్ఎస్‌లు విమర్శలు చేయిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న బీసీల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఉపాధి, ఉద్యోగ కల్పన బీజేపీ విధానం

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి, ఉద్యోగ కల్పనే బీజేపీ విధానమనీ, తమది ప్రజల మ్యానిఫెస్టో అని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడారు. మిగిలిన పార్టీల మ్యానిఫెస్టోలు ఆర్థిక సంక్షోభాలు సృష్టించేలా ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉచితాల పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు విఫలమయ్యాయనీ, అందుకే అక్కడ ప్రజలు తిరుగబడుతున్నారని విమర్శించారు. సంక్షేమం ప్రజలకు అందేలా ప్రణాళిక వేశామనీ, ఇతర పార్టీలు ప్రజలు పూర్తిగా ప్రభుత్వం మీద ఆధార పడేలా తాయిలాలు ఇస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రజలు ఊర్లలోకి రానివ్వడం లేదని విమర్శించారు. బీసీని సీఎం చేయగలిగేది బీజేపీనేనని చెప్పారు. ధరణి పుట్టక ముందు రైతులకు భూమి పట్టాలే లేనట్టు కేసీఆర్ విడ్డూరంగా మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నమ్మొద్దని కోరారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యావ్యవస్థ మూలాలు బలపడాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో విద్యావ్యవస్థను కేసీఆర్ ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిందనీ, ఆ వ్యవస్థ మూలాలు బలపడాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడారు. కొందరు దొంగ సర్వేలు, తప్పుడు రిపోర్టులు ఇస్తున్నప్పటికీ తమ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణ సమాజం మోసపోయిందన్నారు. ప్రజలను మోసం చేసేందుకే మరోసారి ఆరు గ్యారెంటీలతో ముందుకొచ్చిందని విమర్శించారు. అవినీతిని కూకటివేళ్లతో పేకలించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. కేసీఆర్ పాలన అవినీతి మయమైపోయిందన్నారు. జలయజ్ఞంపేరుతో కాంగ్రెస్, కాళేశ్వరం పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. తెలంగాణలో అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలన్నారు. తెలంగాణ ఆర్థిక మూలాలను కోలుకోలేని విధంగా కేసీఆర్ దెబ్బ తీశారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అధికారంలోకి వస్తే ప్రజలకు చిప్ప కూడే మిగులుతుందన్నారు. తాము అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్లను రద్దు చేస్తామనీ, హైకోర్టు తీర్పును అమలు చేస్తామని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరలపై వ్యాట్ తొలగిస్తామన్నారు. సింగరేణి ఉద్యోగులకు ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు చేస్తామని చెప్పారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కోసం నోడల్ ఏజెన్సీ ను ఏర్పాటు చేస్తామన్నారు. కేసీఆర్ హటావో, తెలంగాణకు బచావో, బీజేపీకి జితావ్ ప్రచారంతో ప్రజల్లోకి వెళ్తామన్నారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తాం

- ఇరాన్ ప్రతాప్ ఘర్హి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఐసీసీ మైనార్టీ విభాగం చైర్మెన్ ఇరాన్ ప్రతాప్ ఘర్హి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో సోషల్ మీడియాతో డైనమిక్ ఇంటరాక్షన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీట్లు తగ్గే ప్రసక్తే లేదనీ, ఎంఐఎంతో పొత్తు అవసరమే ఉండదని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీల నాయకులపై జరిగినట్టుగా దాడులు జరగకపోవడమే బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం మధ్య ఉన్న పొత్తుకు నిదర్శనమని తెలిపారు. అలియార్ ఎన్ కౌంటర్ కేసును సీబీఐకి అప్పగిస్తామని హామీ ఇచ్చారు.

బీఎల్ఎఫ్ పోటీ చేయని చోట వామపక్షాలకు మద్దతు

- బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలను ఓడించండి : బిఎల్ఎఫ్ చైర్మెన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పోటీ చేయని స్థానాల్లో వామపక్షాలు, బహుజన సమాజ్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్టు ఆ కూటమి చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క కొల్లాపూర్‌లో మాత్రం నిరుద్యోగి బర్రెలక్కకు మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. డబ్బు, మద్యాన్ని ఎన్నికల్లో విచ్చలవిడిగా పంచుతున్న బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ఓడించాలని పిలుపు నిచ్చారు. డబ్బులు మద్యం పంచకుండా ఎన్నికలలో గెలవాలని ఆయన సవాల్ విసిరారు . కామారెడ్డి గజ్వేల్ నియోజకవర్గాల్లో ఓటుకు పదివేల వరకు ఇస్తామని ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. ఓటర్లను అంగట్లో సరుకులా మారుస్తున్నా ఎన్నికల కమిషన్ ప్రేక్షక పాత్ర వహిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బహుజన, వామపక్ష అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో యంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు గాదె మల్లేష్, ఐక్య ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు మైదం శెట్టి రమేష్‌లు పాల్గొన్నారు.

పది రోజులుగా సొరంగంలోనే....

- కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్
- చిక్కుకున్న కార్మికులకు పైప్ ద్వారా ప్రత్యేక ఆహారం



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో కూలిన టన్నెల్‌లో చిక్కుకున్న 41 మంది కార్మికులు పది రోజులుగా (మంగళవారం నాటికి) మృత్యువుతో పోరాడుతూనే ఉన్నారు. వారిని కాపాడేందుకు మరో నాలుగైదు రోజులు పట్టే అవకాశం కనిపిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తమ వారు సురక్షితంగా వస్తారో, రారోనన్న ఆందోళనతో వారి కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. కార్మికులు ఉన్న చోటకు ఆరు అంగుళాల వెడల్పు ఉన్న ప్రత్యామ్నాయ పైపు చేరుకున్నట్లు ఎన్‌హెచ్‌ఐడిసిఎల్ డైరెక్టర్ అన్షు మాన్షిష్ తెలిపారు. లోపల ఉన్న కార్మికుల ఆహార అవసరాలు తీర్చడానికి ప్రత్యేక ఆహారం కోసం వైద్య నిపుణులను సంప్రదించినట్లు చెప్పారు. సోమవారం మూంగ్ కిచిడీని ఈ పైప్ ద్వారా పంపామని చెప్పారు. తొలుత మూత ఉన్న సీసాల్లో పండ్లతో పాటు తేలికపాటి భోజనాన్ని సొరంగంలో చిక్కుకున్న కార్మికులను అందిస్తామని తెలిపారు. కార్మికులతో సంప్రదింపులు జరిపేందుకు చార్జర్‌తో కూడిన ఫోన్ కూడా పంపనున్నట్లు వివరించారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) కూడా రెస్క్యూ ఆపరేషన్‌లో భాగమైంది. 20, 50 కిలోల బరువున్న రెండు రోబోలను కూలిన సొరంగంలోకి పంపింది. లోపల చిక్కుకున్న కార్మికుల పరిస్థితిని ఈ రోబోలు అంచనా వేసి, రెస్క్యూ ఆపరేషన్‌కు సహకరిస్తాయి. అంతర్జాతీయ టన్నెలింగ్ నిపుణుల బృందం సోమవారం సంఘటనా స్థలానికి చేరింది. ఇంటర్నేషనల్ టన్నెలింగ్, అండర్‌గ్రౌండ్ స్పేస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్నాల్డ్ డిక్స్ ఆధ్వర్యంలో ప్రస్తుతం రెస్క్యూ ఆపరేషన్ కొనసా గుతున్నది.

సిఎంతో మాట్లాడిన ప్రధాని మోడీ

కార్మికులను కాపాడేందుకు జరుగుతున్న ప్రయత్నాల గురించి తెలుసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ దామితో మాట్లాడారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. కేంద్రం నుండి అవసరమైన సాయం అందుతుందని హామీ ఇచ్చారని సిఎంఓ కార్యాలయం తెలిపింది. లోపల చిక్కుపోయిన కార్మికుల మనోధైర్యం దిగజారకుండా చూడాల్సిన అవసరం కూడా వుందని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర సంస్థల సమన్వయంతో కార్మికులను త్వరగా కాపాడేందుకు కృషి చేస్తామని సిఎం హామీ ఇచ్చారు.

నా మాటలకు కట్టుబడి ఉన్నా

- 'ఇజ్రాయెల్-పాలస్తీనా' లెక్చర్ విషయంలో డీయూ ప్రొఫెసర్



న్యూఢిల్లీ : ఇజ్రాయెల్-పాలస్తీనా సంఘర్షణకు సంబంధించిన చరిత్రపై లెక్చర్ విషయంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఢిల్లీ యూనివర్సిటీ (డీయూ) మాజీ ప్రొఫెసర్ అచిన్ వనైక్ అన్నారు. హర్యానాలోని ఓపీ జిందాల్ యూనివర్సిటీలో ఈనెల 1న ఆయన తన లెక్చర్‌ను వినిపించారు. అయితే, ఆయన వ్యాఖ్యలపై ఓపీ జిందాల్ యూనివర్సిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేయాలని అచిన్‌ను కోరింది. ఈ మేరకు అచిన్ పై విధంగా స్పందించారు.అచిన్ తన లెక్చర్‌లో జియోనిజయం, హిందూత్వ జాతీయవాదాన్ని పోల్చారు. ఇందులో ఒకరి హింసను ఉగ్రవాదంగా ఆరోపించటం, మరొక దానిని అలా అనకపోవటం ఏమిటని ప్రశ్నించారు. జియోనిజమ్, హిందూత్వ అనేవి వేర్వేరన్నారు. జియోనిజమ్ ముస్లిం వ్యతిరేకం కాదనీ, కానీ, హిందూత్వ ప్రాథమికంగా, పునాదిగా ముస్లిం, ఇస్లామిక్‌కు వ్యతిరేకమని తెలిపారు. అయితే, తన వ్యాఖ్యలను వక్రీకరించారని అచిన్ అన్నారు. తాను ఉగ్రవాదానికి అనుకూలుడన్న వాదన అర్ధరహితమని తెలిపారు. జియోనిజం అంటే 19 శతాబ్దంలో పాలస్తీనాలో యూదుల మాతృభూమి ఏర్పాటు కోసం జరిగిన ఒక జాతీయోద్యమం. అచిన్ తన ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలు తగిన విధంగా లేవనీ, అవి అసంబద్ధమైనవని పేర్కొంటూ ఈనెల 13న ఓ.పి జిందాల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డబిరు శ్రీధర్ పట్నాయక్ ఆయనకు(అచిన్) లేఖ రాశారు. దీనికి వివరణ ఇస్తూ అచిన్ పై విధంగా స్పందించారు. కాగా, అచిన్ లెక్చర్‌పై అంతకముందు ఇజ్రాయెల్ సైతం అభ్యంతరం వ్యక్తం చేసింది.

జేఎన్టీయూ విద్యార్థులను ప్రమోట్ చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జేఎన్టీయూహెచ్ పరిధిలో ఆర్క్స18, ఆర్క్స22 విద్యార్థులను ప్రమోట్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రతిసారి విద్యార్థుల భవిష్యత్తును రోడ్డుపై పెడుతున్న జేఎన్టీయూహెచ్ పాలకమండలి వైఖరి మార్చుకోవాలని కోరింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జేఎన్టీయూహెచ్ కూకట్‌పల్లి, సిరిసిల్ల, సుల్తాన్‌పూర్ పరిధిలోని కళాశాలల్లో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం నుంచి రెండో ఏడాదిలోకి వచ్చిన విద్యార్థులు (ఆర్ 22), రెండో ఏడాది నుంచి మూడో సంవత్సరంలోకి వచ్చిన విద్యార్థులు (ఆర్ 18)లను సరైన పద్ధతిలో మూల్యాంకనం చేయలేదని తెలిపారు. విద్యార్థులకు సున్నా మార్కులు వేసి ఫెయిల్ చేశారని పేర్కొన్నారు.

అసలు చదవని విద్యార్థులు ఎక్కువ మార్కులు పొందారని వివరించారు. ర్యాంకులు పొందిన వారు జీరో మార్కులతో ఫెయిల్ అయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఈ సంవత్సరం మాత్రమే కాదనీ, గతంలోనూ సరైన పద్ధతిలో మూల్యాంకనం చేయకుండా విద్యార్థులను ఫెయిల్ చేసి క్రెడిట్లు లేవనే పేరుతో డిటెయిన్ చేశారని విమర్శించారు.


ఇప్పుడు 60 శాతం మార్కులు రాలేదనే పేరుతో డిటెయిన్ చేయడం వల్ల విద్యార్థులు రెండేండ్లు చదువుకు దూరమవుతారని తెలిపారు. వర్సిటీ పాలకమండలి విద్యార్థుల భవిష్యత్ గురించి కాకుండా, అందరినీ ఫెయిల్ చేసి ఫీజులతో లాభాలు గడించాలని చూస్తున్నదని పేర్కొన్నారు. జేఎన్టీయూ సిరిసిల్లలో ఏడాది కాలంగా కనీసం పాఠ్యపుస్తకాలు లేకుండా, ల్యాబ్‌లు నిర్వహించకుండా, సెమిస్టర్ పరీక్షలను నిర్వహించారని తెలిపారు.

ఈ ఏడాది అడ్మిషన్లు కూడా లేకుండా ఇప్పుడు డిటెయిన్ చేయడమంటే విద్యార్థుల భవిష్యత్తు నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ ప్రతిసారి ఇష్టానుసారంగా నిర్ణయాలు చేస్తూ విద్యార్థులను రోడ్డున పడేస్తున్నదని విమర్శించారు. తక్షణమే విద్యార్థులు వారి చదువులు నష్టపోకుండా ప్రమోట్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రంలో చలో జేఎన్టీయూహెచ్ కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

మోడీకి చిత్తశుద్ధి ఉంటే...

- ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ తేవాలి : కర్నాటక మంత్రి మునియప్ప

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ప్రధాని మోడీకి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ తేవాలని కర్నాటక మంత్రి మునియప్ప సవాల్ విసిరారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత వర్గాలకు మేలు చేయాలని నిజంగా భావిస్తే ఆర్డినెన్స్ చేసి పార్లమెంటుకు తీసుకురావాలనీ, దానికి కాంగ్రెస్ మద్ధతిస్తుందని స్పష్టం చేశారు. తమ పార్టీ చెప్పేవే చేస్తుందనీ, చేసేవే చెబుతుందని తెలిపారు. కర్నాటకలో ఐదు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చామనీ, వాటిని అమలు చేస్తున్నామన్నారు. ఆయా గ్యారంటీలను అమలు చేయడం లేదని తెలంగాణ సీఎం కేసీఆర్ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. పదేండ్లలో ఆయన ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. దేశంలోనే మొదటిసారి గృ హలక్ష్మి పథకాన్ని కర్నాటకలో ప్రవేశపెట్టినట్టు మునియప్ప వెల్లడించారు. తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలనీ, తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు అభివృద్ధి ఎలా చేశారో ప్రజలకు తెలుసున్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక ఆయన పాలనంతా అవినీతిమయంగా మారిందని విమర్శించారు.

సెబీపై కోర్టుధిక్కరణ చర్యలు చేపట్టండి

- సుప్రీంకోర్టులో పిటిషన్
- అదానీ గ్రూపుపై విచారణను జాప్యం చేస్తోందని ఆరోపణ

న్యూఢిల్లీ : అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలను విచారిస్తున్న సెబీపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. విచారణను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడంలో సెబీ విఫలమైందని, విచారణను జాప్యం చేస్తోందని పిటిషనర్ ఆరోపించారు. అదానీ గ్రూపుపై అమెరికా సంస్థ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ చేసిన ఆరోపణలను సెబి విచారిస్తున్న విషయం తెలిసిందే. అదానీ గ్రూపు తన కంపెనీల వాటాల విలువను పెంచుకునేందుకు అక్రమాలకు పాల్పడిందని, ఖాతాల్లో అవకతవకలు జరిగాయని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. వీటిపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలంటూ న్యాయవాది విశాల్ తివారీ సహ పలువురు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఆరోపణలపై విచారణ జరిపే బాధ్యతను సెబీకి సుప్రీంకోర్టు అప్పగించింది. విచారణను పూర్తి చేసి, ఆగస్ట్ 14వ తేదీలోగా నివేదిక అందజేయాలని ఆదేశించింది. అయితే ఇప్పటి వరకూ సెబీ తన తుది నివేదికను న్యాయస్థానానికి సమర్పించలేదు. దీనిపై విశాల్ తివారీ మరోసారి కోర్టు తలుపు తట్టారు. కోర్టు ఆదేశాలను ఎందుకు పాటించలేదో సెబీ నుండి వివరణ కోరాలని అభ్యర్థించారు. అంతేకాక సెబీపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని కూడా కోరారు. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్‌పీ) జరిపిన విచారణను కోర్టు దృష్టికి తెచ్చారు. అదానీ గ్రూపు కంపెనీలు అవకతవకలకు పాల్పడ్డాయని ఆ విచారణ సైతం నిర్ధారించిందని తెలిపారు. సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ ఈ నివేదికను కూడా పరిశీలించాలని కోరారు. అదానీ గ్రూపులో అవకతవకలకు సంబంధించిన కేసు విచారణ ఆగస్ట్ 29న జరగాల్సి ఉన్నప్పటికీ అది సుప్రీంకోర్టులో ఇప్పటి వరకూ లిస్ట్ కాలేదు. ఈ విషయాన్ని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ నెల 6న ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ దృష్టికి తీసికెళ్లారు. ఈ కేసును అత్యవసరమైనదిగా పరిగణించాలని కోరారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని చంద్రచూడ్ తెలిపారు. హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు సెబీకి సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు వాస్తవానికి మే 2వ తేదీనే ముగిసింది. గడువును పొడిగించాలని సెబీ కోరింది.

ఎయిర్ ఇండియాకు బెదిరింపులు

- ఎస్ఎఫ్‌జె, పన్నున్‌పై ఎన్ఐఎ కొత్త కేసు



న్యూఢిల్లీ : ఎయిర్ ఇండియాకు బెదిరింపుల వివాదంలో సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె), దాని వ్యవస్థాపకులు గుపత్వంత్ సింగ్ పన్నున్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కొత్తగా కేసు నమోదు చేసింది. ఈ నెల 19న ఎయిర్ ఇండియాను ప్రపంచవ్యాప్తంగా దిగ్బంధనం చేస్తామని, ఎయిర్ ఇండియాలో ప్రయాణం చేస్తే 'జీవితాలు ప్రమాదంలో పడతాయి' అని సిక్కులను ఒక వీడియో క్లిప్‌లో బెదిరించిన సంగతి తెలిసిందే. ఈ బెదిరింపులపై భారత్, కెనడాతో సహా ఎయిర్ ఇండియా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మరికొన్ని దేశాల్లోని విచారణ సంస్థలు హైఅలర్ట్ ప్రకటించి, దర్యాప్తు ప్రారంభించాయని ఎన్ఐఎ సోమవారం తెలిపింది. ఐపిసి, ఉపా చట్టంలోని అనేక సెక్షన్ల కింద ఎన్ఐఎ కొత్త కేసు నమోదు చేసింది. ఎస్ఎఫ్‌జెపై 2019 జులై 10న నిషేధం విధించిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, 2010 జులై 1న పున్నున్‌ను 'వ్యక్తిగత తీవ్రవాది'గా గుర్తించింది. వివిధ సోషల్ మీడియా వేదికలపై బెదిరింపుల వీడియో సందేశాలను ఎస్ఎఫ్‌జె విడుదల చేసి, వైరల్ చేసిందని ఎన్ఐఎ ఆరోపించింది. ఎయిర్ ఇండియాను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబోమని, ఈ నెల 19న న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేస్తామని ఎస్ఎఫ్‌జె హెచ్చరించిందని తెలిపింది.కాగా, ఒక వ్యక్తిగత ఆస్తుల విషయంలో 2019లోనే ఎస్ఎఫ్‌జె, పన్నున్‌పై ఎన్ఐఎ తొలిసారిగా కేసు నమోదు చేసింది.

అలాగే భారత్ ఆతిథ్యం ఇస్తున్న క్రికెట్ ప్రపంచకప్‌ను 'వరల్డ్ టెర్రర్ కప్'గా మారుస్తామని బెదిరించినందుకు ఈ ఏడాది సెప్టెంబర్ 29న పన్నున్‌పై గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ బ్రాంచ్ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.ఎస్ఎఫ్‌జె, పన్నున్‌పై దేశంలో మొత్తంగా సుమారు 24 కేసులు నమోదయ్యాయని ఒక అంచనా. వీటిల్లో ఎక్కువగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు చేసినందుకు, లేదా వ్యక్తులు, సంస్థలను బెదిరించినందుకు నమోదైనవే.